


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 188, పేజీలు - 08

సోమవారం, నవంబర్ 18, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## రాజకీయ నేతల అహం దెబ్బ తింటోందా.?

### - రాజకీయాల్లో కొత్త కోణం చూస్తున్నామా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయాలు చాలా హుందాగా కొనసాగేవి. అధికార, విపక్షాలు ఎత్తుకుపైశ్ఎత్తులు వేసుకున్నా కలిసినప్పుడు మాత్రం హుందాగా ప్రవర్తించారు. ముఖ్యంగా వైఎస్, చంద్రబాబు లాంటి నేతలను రాజకీయ నేతలు ఉదహరిస్తున్నారు. రాజకీయాల్లో హుందాతనం అవసరమే. కానీ నేటి రోజుల్లో అదంతా కానరావడం లేదు. ఇటీవల ఇదే అంశాన్ని రాజకీయాల్లో సీనియర్, మాజీ ఉపరాష్ట్రపతి అయిన వెంకయ్యనాయకుడు ప్రస్తావించారు. రాజకీయాల్లో విలువలు లేకుండా పోయాయని, అధికారంలోకి వచ్చిన నాయకుడు ఎదుటి వాడిని అణిచివేయాలని విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. అధికారంలో తాము మాత్రమే ఉండాలనే యావ పెరిగిపోయిందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. ఇందుకు చాలా కారణాలను, ఉదాహరణాలను వివరిస్తున్నారు. రాజకీయాల్లో రానున్న రోజుల్లో మరింత అతి పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇక ఇదే నిజమైతే అధికారం కోల్పోయిన వారికి ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు.తెలంగాణ వరకు చూసుకుంటే బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ప్రతిపక్షాలను కొంత మేర ఇబ్బందులకు గురిచేసింది. ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డిని ఇబ్బందులకు గురిచేసింది. ఆయనపై వ్యక్తిగత రాజకీయాలు చేసిందని చాలా మంది రేవంత్ రెడ్డి అభిమానులు వాపోతుంటారు. ఇది మాత్రమే రేవంత్ రెడ్డిని మరింత ఎదిగేందుకు దోహదం చేసిందని చెబుతున్నారు. బీజేపీ నేతలు బండి సంజయ్, ఈటెల రాజేందర్, డీ అర్వింద్ విషయంలోనూ బీఆర్ ఎస్ ఇదే రీతిలో ప్రవర్తించింది. ఇప్పుడు ఇందుకు తగ్గ మూల్యాన్ని చెల్లించుకుంది. ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారాన్ని తీసుకుంటే అధికార బీఆర్ ఎస్ ఎలా వ్యవహరించిందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ మాత్రం తామేం తక్కువ తినలేదన్నట్లుగా ప్రవర్తిస్తున్నది. బీఆర్ ఎస్ నేతలే టార్గెట్ గా ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నది. ఎప్పుడెప్పుడు ఎవరిని అరెస్ట్ చేద్దామా అన్నట్లుగా నే పరిస్థితి ఉంది. ఇప్పటికే పెద్ద సంఖ్యలో కేసులు బీఆర్ ఎస్ నేతలపై నమోదవుతున్నాయి. ఇక ఏపీలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గత జగన్ సర్కారు టీడీపీ నేతల విషయంలో అత్యంత దారుణంగా వ్యవహరించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రతిపక్షాల విషయంలో ఇంత దారుణంగా వ్యవహరించడ అరుదు. ఆయన కొంత హుందా రాజకీయాలు చేసేవారని పేరుంది. ఇక జగన్ అలాంటి రాజకీయలకు చెక్ పెట్టారు. వ్యక్తిగతంగా చంద్రబాబు మీద కక్ష తీర్చుకునే ప్రయత్నం చేశారు. తన చేతిలో అధికారం ఉందని వివిధ కేసులు నమోదు చేసి, ఏసీబీ ద్వారా జైలుకు పంపించారు. టీడీపీ నేతల పై కూడా ఇదే రీతిలో ప్రవర్తించారు. ఇక వైసీపీ నేతలు టీడీపీ కి చెందిన మహిళ నేతలపై

2లో..

## జార్ఖండ్‌లో హెూరాహెూరీ

### - ఇండియా కూటమికి కొత్త అర్థం చెప్పిన నడ్డా



**రాంచీ (ప్రశ్న న్యూస్)** జార్ఖండ్ అసెంబ్లీకి జరుగుతున్న రెండో విడత పోలింగ్ ప్రచారం చివరి దశకు చేరుకుంది. ఈ నెల 20న జరిగే రెండో దశ ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకునేందుకు ఇండియా కూటమి, ఎన్డీయే సిద్ధమవుతున్నాయి. నేడు సాయంత్రంతో ప్రచారం ముగియనున్న నేపథ్యంలో పార్టీల మధ్య మాటల యుద్ధం కూడా పెరుగుతోంది. ఇదే క్రమంలో జార్ఖండ్ లో ప్రచారం నిర్వహించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ

2లో..

## సోదరుని పాడె మోసిన సీఎం చంద్రబాబు

### - అధికారిక లాంఛనాలతో రామ్మూర్తినాయుడు అంత్యక్రియలు పూర్తి



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియలు ఆదివారం పూర్తయ్యాయి. ఆయన స్వగ్రామం తిరుపతి జిల్లా నారావారిపల్లెలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, రామ్మూర్తినాయుడు తనయుడు, సినీ నటుడు నారా రోహిత్, గిరీష్ ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తల్లిదండ్రుల అంత్యక్రియలు నిర్వహించిన చోటే రామ్మూర్తినాయుడి అంత్యక్రియలు నిర్వహించారు.

2లో..

## అదిరిపోయే రీతిలో అమరావతి మాస్టర్ ప్లాన్

### - మంగళగిరి, గుంటూరు, విజయవాడకు మహర్దశ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని వేరే లెవల్‌కు తీసుకెళ్లాలని ప్రభుత్వం ప్లాన్ రెడీ చేస్తోంది. చుట్టుపక్కల ఉన్న నగరాలను కలుపుకొని దీన్ని మెగా సిటీగా రూపకల్పన చేయాలని భావిస్తోంది. కొత్త రూపొందిస్తున్న మాస్టర్ ప్లాన్ మతిపోయేలా చేస్తోంది. కోటి మంది జనాభాతో ప్రపంచంలోనే టాప్ మెగా సిటీగా తీర్చిదిద్దాలని స్కెచ్ వేస్తోంది ప్రభుత్వం. అందుకు తగ్గట్టుగానే ప్రతిపాదనలు రెడీ చేసింది. అమరావతితో పాటు విజయవాడ, గుంటూరు, మంగళగిరిని కూడా వేరే లెవల్‌క తీసుకెళ్లాలని సీఆర్డీఏను సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాజధాని పరిధిలో 217 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నప్పటికీ దాని ఎఫెక్ట్‌తో జరిగే అభివృద్ధిని మాత్రం మిగతా మూడు నగరాలకు వ్యాప్తి చెందేలా చూస్తున్నారు. అందుకోసం ఈ నగరాల్లో ప్రత్యేకంగా తీర్తిదిద్దే పనికి శ్రీకారం చుట్టబోతోంది. రాజధానిగా అమరావతి అభివృద్ధి చేస్తే లాజిస్టిక్ హబ్‌గా మంగళగిరిని తీర్చిదిద్దనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ గుంటూరు మార్చబోతున్నారు. విజయవాడను వాణిజ్య కేంద్రంగా తయారు తయారు చేయనున్నారు. ఇలా నాలుగు సిటీలతో అమరావతిని ప్రపంచంలోనే నెంబవర్ వన్ సిటీల జాబితాలో ఉంచబోతున్నారు. ఇప్పటికే గుంటూరు ఎడ్యుకేషన్‌కు కేంద్రబిందువుగా ఉంది. దీన్నే అవకాశంగా మార్చుకుంటున్న ప్రభుత్వం ఆధునిక ప్రపంచానికి కావాల్సిన

2లో..

## అంబులెన్స్ కు దారివ్వని వ్యక్తికి భారీ అపరాధం

### - రూ.2.5 లక్షల జరిమానా.. లైసెన్స్ రద్దు



**తిరువనంతపురం (ప్రశ్న న్యూస్)** ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అత్యంత కీలకమైనది అంబులెన్స్. అందుకే ఎంతటి ట్రాఫిక్ ఉన్నప్పటికీ అంబులెన్స్ వస్తే దారిస్తారు. అంబులెన్స్ కు సిగ్నల్ల నుంచి కూడా మినహాయింపు ఉంటుంది. బెంగళూరు వంటి నగరాల్లో అంబులెన్స్ కు దారిచ్చేందుకు వాహనదారుల సిగ్నల్ జంప్ చేసినా జరిమానా ఉండదు. మరి, అంబులెన్స్ కు అంతటి ప్రాధాన్యత ఉంటుంది. కానీ కేరళలో ఓ ప్రబుద్ధుడు అంబులెన్స్ కు దారివ్వకుండా ఇబ్బందిపెట్టాడు. అతడికి అధికారులు ఎలాంటి షాకిచ్చారో తెలిస్తే, అతడికి తగిన శాస్తి జరిగిందని ప్రతి ఒక్కరూ అంటారు. కేరళలో

2లో..

## తగ్గేదే లే.. ఆ ప్రాజెక్ట్‌పై ముందుకే

### - కుండబద్దలు కొట్టిన రేవంత్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, విమర్శలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిప్పి కొట్టారు. ఎదురుదాడికి దిగారు. కిషన్ రెడ్డిని గుజరాత్ కా గులామ్‌గా అభివర్ణించారు. తమ హయాంలో తెలంగాణ అభివృద్ధి చెందడాన్ని ఓర్వలేకపోతున్నాడంటూ విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రస్తుతం నాగ్‌పూర్‌లో ఉన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన (ఉద్ధవ్ థాకరే)- నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్)- కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తోన్నారు. మహా వికాస్ అగాఢీ అభ్యర్థుల కోసం తెలుగు వాళ్ల ఎక్కువగా స్థిరపడిన నియోజకవర్గాల్లో పర్యటిస్తోన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు రేవంత్ రెడ్డి. భారతీయ జనతా పార్టీ తెలంగాణ నాయకులు చేపట్టిన మూసీ నిద్ర గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చారు. కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పు పట్టారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతోంటే నిందలు వేస్తోన్నారంటూ ఆరోపించారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తే కిషన్ రెడ్డి చప్పట్లు కొట్టి హర్షం వ్యక్తం చేశారని, ఆ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం 50,000 మందిని తరలించిందని గుర్తుచేశారు. అలాంటి ప్రాజెక్టే తాము చేపడితే విమర్శలు గుప్పిస్తోన్నాడని, దీన్ని వ్యతిరేకిస్తోన్నాడని అన్నారు. దీన్ని బట్టి చూస్తే కిషన్ రెడ్డి గుజరాత్‌కు గులాంలా మారినట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. గుజరాత్ మోడల్‌కు ధీటుగా తెలంగాణ మోడల్ అభివృద్ధి చెందుతోందని, ఇది దేశానికే రోల్ మోడల్

2లో..

## తెలంగాణలో ఇద్దరు ముఖ్యమంత్రులు

### - తెలంగాణకు రేవంత్, కేటీఆర్ ఇద్దరు సీఎంలు అన్న బండి సంజయ్
### - కేటీఆర్ నటన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్య
### - కేటీఆర్ కు తెలియకుండానే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందా అని ప్రశ్న



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రెండు రోజులుగా కనిపించలేదు, శనివారం (నవంబర్ 16న) బీజేపీ నిర్వహించిన మూసీ బస్తీ నిద్ర కార్యక్రమంలో కూడా పాల్గొనలేదు. అయితే తాను కనిపించకపోవటానికి కారణాన్ని బండి సంజయ్ వెల్లడించారు. కాళ్ల నొప్పితోనే తాను 2 రోజులు కనపడలేదని క్లారిటీ ఇచ్చిన బండి సంజయ్ తనపై, బీజేపీ నేతలపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను కాళ్ల నొప్పితో

2లో..

## హస్తిన రాజకీయాల్లో అనూహ్య ప్రకంపనలు

### - ఢిల్లీలో గేమ్ స్టార్ట్ చేసిన బీజేపీ
### - ఆప్‌లో మొదటి వికెట్ డౌన్
### - రాజీనామా చేసిన మంత్రి కైలాష్ గెహ్లాట్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశ రాజధానిలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీలో భూకంపం సంభవించింది. అంతర్గత కుమ్ములాటలు ఒక్కసారిగా అగ్నిపర్వతంలా బద్దలయ్యాయి. ఇంకో నాలుగైదు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొనాల్సి ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో చోటు చేసుకున్న ఈ పరిణామాలు అధికార పార్టీని కుదేల్ చేశాయి. ఉక్కిరిబిక్కిరికి గురి చేసినట్టయింది. ఆమ్ ఆద్మీ పార్టీ

2లో..

## బాధితులకు కొండంత అండ

### - మూసీ ప్రక్షాళన ఆపేందుకు బీజేపీ బస్తీ నిద్ర



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మూసీ ప్రక్షాళన రాజకీయం మరోసారి హీటెక్కింది. నిర్వాసిత ప్రాంతాల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బస్తీ నిద్ర చేశారు. అనంతరం రేవంత్ సర్కారుపై విమర్శలు చేశారు. దీనికి కాంగ్రెస్ పార్టీ నుంచి అదే స్థాయిలో రియాక్షన్ కూడా వచ్చింది. ఈ సందర్భంగా భవిష్యత్ రాజకీయాలపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మూసీ నది విషతుల్యమైపోయిందని అక్కడ ఒక ఆరు నెలలపాటు సామాన్య ప్రజల్లో నివసిస్తే కచ్చితంగా ప్రక్షాళన ఆపేస్తానంటూ సీఎం రేవంత్ రెడ్డి తరచూ సవాళ్లు చేస్తున్నారు. దీన్ని అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ ప్రయత్నించింది. ఏకంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బస్తీ నిద్రపేరుతో అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలోని తులసీరామ్ నగర్‌లో బస్తీ వాసులతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. రాత్రంతా అక్కడ పడుకున్న కిషన్ రెడ్డి ఉదయాన్నే మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొత్తుల విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాము ఏ పార్టీతో ఒప్పందాలు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

2లో..

## తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ

### - ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఈవీ) వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీని ద్వారా వినియోగదారులకు ఏడాదికి సుమారు రూ.లక్ష మిగులుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సోమవారం నుంచి కొత్త ఈవీ పాలసీ వస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈవీ పాలసీ వివరాలను మంత్రి వెల్లడించారు. 'రాష్ట్రంలో రవాణా శాఖ పరంగా మార్పులు చేర్పులు తీసుకొచ్చి ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేపడుతున్నాం. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నేతృత్వంలో హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతాం. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ కాలుష్యం రాకుండా ఉండేందుకు ఈవీ పాలసీ తీసుకొచ్చాం. గతంలో

2లో..

## రాష్ట్రంలో పెరుగుతున్న చలి

### - పిల్లలు, వృద్ధులు జాగ్రత్త



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని వివిధ జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హైదరాబాద్ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో 11 నుంచి 15 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదిలాబాద్, జగిత్యాల, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్లలో ఆదివారం నుంచి నవంబర్ 20 వరకు ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు చెప్పారు. పెద్దపల్లి, ములుగు,

2లో..

# జార్ఖండ్‌లో హోరాహోరీ

నడ్డా అధికార ఇండియా కూటమిపై మాటల తూటాలు పేల్చారు. జార్ఖండ్ లో ప్రస్తుతం అధికారంలో ఉన్న ఇండియా కూటమి ఏర్పాటు వెనుక స్వార్థపూరిత ఉద్దేశాలు ఉన్నాయని ధన్‌బాద్ జిల్లాలోని సింద్రీలో జరిగిన ర్యాలీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శించారు. వారసత్వ రాజకీయాలతో పాటు ఓటర్లను బుజ్జగించే రాజకీయాలే ఇందులో ఉన్నాయని నడ్డా ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన అభివృద్ధి పథకాలను జార?ండ్ లో అమలు కాకుండా సీఎం హేమంత్ సోరెన్ అడ్డుపడుతున్నారని నడ్డా విమర్శించారు.జార్ఖండ్ లో అధికార జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి గిరిజన వ్యతిరేకం, రైతుల వ్యతిరేకం, దళితులు వ్యతిరేకమని జేపీ నడ్డా విమర్శలు గుప్పించారు. అవినీతి, వారసత్వ రాజకీయాలు, ఓటర్ల బుజ్జగింపు రాజకీయాల్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. గిరిజన భూముల్లో ఆక్రమణదారుల్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ముఖ్యంగా గిరిజన మహిళల్ని పెళ్లి చేసుకుని వారి భూముల్ని కబ్జా చేస్తున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వీటికి అడ్డుకట్ట వేసేలా చట్టం చేస్తామని జేపీ నడ్డా ఓటర్లకు హామీ ఇచ్చారు. జార?ండ్ అసెంబ్లీకి జరిగే ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈ నెల 23న జరగనుంది.

# సోదరుని పాడె మోసిన సీఎం చంద్రబాబు

అంతిమయాత్రలో సోదరుడి పాడెను సీఎం చంద్రబాబు మోశారు. అంతకుముందు రామ్మూర్తి భౌతిక కాయానికి మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్, చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ నివాళులర్పించారు. అలాగే, టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రామ్మూర్తి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. సినీ నటుడు మోహన్ బాబు, మంచు మనోజ్, సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్ తదితరులు భౌతిక కాయానికి అంజలి ఘటించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోన్న రామ్మూర్తినాయుడు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. అనంతరం ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామం నారావారిపల్లెకు తరలించారు. ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నారా రామ్మూర్తినాయుడు 1952లో ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మ దంపతులకు జన్మించారు. సీఎం చంద్రబాబు ఆయన సోదరుడు. రామ్మూర్తినాయుడు ఎస్వీ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో బీఏ చేశారు. 1992 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నారు. 1994లో టీడీపీ తరఫున చంద్రగిరి నుంచి పోటీ చేసి గెలుపొందారు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2003లో అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియా సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఆ తర్వాత 2004లో శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం ఆదేశించగా ఆ పార్టీతో విభేదించారు. అనంతరం చంద్రగిరి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయనకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి.

# తగ్గేదే లే.. ఆ ప్రాజెక్ట్‌పై ముందుకే

అవుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో తన సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలు దేశం మొత్తానికీ ఆదర్శవంతమౌతాయని, గుజరాత్ మోడల్ ఘోరంగా విఫలమౌతుందని చెప్పారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్.. సొంత కుంపటి పెట్టుకుని మహారాష్ట్ర ప్రజలను ఏరకంగా అయితే మోసగించారో అదే తరహాలో జీ కిషన్ రెడ్డి కూడా తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ ప్రజలను మోసం చేస్తోన్నాడంటూ రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కిషన్ రెడ్డి సహా తెలంగాణ బీజేపీ నాయకులు ఏమనుకున్నా గానీ మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తామని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను నిర్దేశించుకున్న గడువులోగా పూర్తి చేస్తామని అన్నారు. తెలంగాణను దేశంలోనే రోల్ మోడల్‌గా నిలుపుతామని స్పష్టం చేశారు.

# అంబులెన్స్ కు దారివ్వని వ్యక్తికి భారీ అపరాధం

ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతడిని అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. రోడ్డుపైకి వచ్చాక అన్ని వాహనాలు పక్కకి తొలగి అంబులెన్స్ కు దారిచ్చాయి. కానీ ఓ కారు మాత్రం అంబులెన్స్ కు దారివ్వకుండా ఏకంగా రెండున్నర కిలోమీటర్లు ప్రయాణించింది. అంబులెన్స్ డ్రైవర్ అదే పనిగా హారన్ కొడుతున్నా, ఆ కారు ఓనర్ పట్టించుకోలేదు. ఈ వ్యవహారాన్నంతా అంబులెన్స్ లోని ఓ వ్యక్తి ఫోన్ ద్వారా వీడియో రికార్డు చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా, నెటిజన్లు ప్రతి ఒక్కరూ ఆ కారు యజమానిని తెగ తిట్టారు. ఈ వీడియో కేరళ పోలీసుల దృష్టికి వెళ్లడంతో వెంటనే రంగంలోకి దిగారు. ఆ కారు ఎవరిదో గుర్తించి, నేరుగా ఆ వ్యక్తి ఇంటికి వెళ్లారు. అంబులెన్స్ కు ఎందుకు దారి ఇవ్వలేదని ప్రశ్నించారు. అయితే ఆ కారు యజమాని చెప్పిన సమాధానాలు ఒకదానికొకటి సంబంధం లేకుండా ఉండడంతో, పోలీసులు మండిపడ్డారు. ఆ కారు యజమానికి రూ.2.5 లక్షల ఫైన్ వేయడంతోపాటు అతడి డ్రైవింగ్ లైసెన్స్ ను క్యాన్సిల్ చేశారు. ఆ దుర్మార్గపు కారు యజమానికి ఇలాగే జరగాలంటూ నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. మంచి పని చేశారంటూ కేరళ పోలీసులను ప్రశంసిస్తున్నారు.

# అదిరిపోయే రీతిలో అమరావతి మాస్టర్ ప్లాన్

వసతులు, విద్య కోర్సులు, ఇతర ఇనిస్టిట్యూట్‌లను అక్కడ ఏర్పాటు చేయనున్నారు. విజయవాడ ఇప్పటికే ఆటో, వాణిజ్యం పరంగా ముందంజలో ఉంది. దీన్ని మరింతంగా తీర్చిదిద్దబోతున్నారు. అమరావతి అబివృద్ధి కోసం ప్రపంచ బ్యాంక్ నిధులు సాయం చేస్తోంది. త్వరలోనే ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో పడనున్నాయి. ఒక్కసారి నిధులు పడిన వెంటనే అమరావతి పనులు ఊపందుకోనున్నాయి. అమరావతితోపాటు గుంటూరు, విజయవాడ, మంగళగిరిని డెవలప్ చేయనున్నారు. ఈ నగరాల్లో ఉన్న నూజివీడు, తెనాలి, గుడివాడ లాంటి ప్రాంతాలను ప్రత్యేక కేంద్రాలుగా డెవలప్ చేయనున్నారు. ప్రత్యేక విమానాశ్రయాలు, ఇన్నర్, అవుటర్ రోడ్డులు, బైపాస్‌లు, ఏర్పాటు చేస్తారు. అసలు రాజధాని ప్రాంతానికి అన్ని ప్రాంతాల నుంచి త్వరగా చేరుకునే రవాణా వ్యవస్థలు అభివృద్ధి చేస్తారు. అమరావతి ప్రాంతంతోపాటు రాష్ట్రంలో రవాణా వ్యవస్థ మరింతగా మెరుగుపడేందుకు ఇటీవల కేంద్రం ప్రకటించిన రైల్వే వ్యవస్థ, అవుటర్ రింగ్‌రోడ్డు సహాయపడబోతోంది. వీటికి తోడు సూపర్ పాస్ట్ కారిడార్లు కూడా నిర్మించాలని కూడా ప్రభుత్వ ఆలోచిస్తోంది. వీటితోపాటు ఈ నాలుగు నగరాల్లో లేటెస్ట్ టెక్నాలజీని విస్తృతంగా వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్‌లో ఎంత జనాభా పెరిగినా సమస్యలు రాకుండా ఉండేలా, ట్రాఫిక్ జంజాటం లేకుండా ప్లాన్ చేస్తోంది. ఇప్పటికే రోడ్లు అన్నింటినీ అనుసంధానిస్తూ పటిష్టమైన రోడ్లు వేసేందుకు డీపీఆర్ రూపకల్పనకు కన్సల్టెన్సీలను సీఆర్‌డీఏ ఆహ్వానించింది. ఇన్నర్ రింగ్ రోడ్డు ఆధ్యయనానికి కూడా కన్సల్టెన్సీలను పిలిచారు. ఇప్పటికే చాలా కంపెనీలు దీని కోసం పోటీ పడుతున్నాయి. సోమవారం ఈ డీపీఆర్ టెండర్లు పరిశీలించి నిర్ణయం తీసుకోనుంది. ఒకసారి టెండర్లు ఖరారు అయిన తర్వాత రెండు నెలల్లో పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేయనున్నారు.

# హస్తిన రాజకీయాల్లో అనూహ్య ప్రకంపనలు

సీనియర్ నాయకుడు, మంత్రి కైలాష్ గెహ్లాట్ తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ గుడ్‌బై చెప్పారు. తన రాజీనామా లేఖను ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు పంపించారు.

ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను వివరిస్తూ సుదీర్ఘ లేఖ రాశారు. ముఖ్యమంత్రి ఆతిషి సారథ్యంలోని ఢిల్లీ ప్రభుత్వంలో కీలక శాఖలను పర్యవేక్షిస్తోన్నారు కైలాష్ గెహ్లాట్. రవాణా, పాలన సంస్కరణలు, ఐటీ, హోం, మహిళా శిశుసంక్షేమ శాఖలు ఆయన ఆధీనంలోనే ఉన్నాయి. హఠాత్తుగా ఆయన రాజీనామా చేయడం, కేజ్రీవాల్‌కు సుదీర్ఘ లేఖ రాయడం ప్రకంపనలు పుట్టిస్తోంది. మంత్రివర్గం అనేది ఓ అద్దాల మేడలా మారిందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారాయన.ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని కైలాష్ గెహ్లాట్ ఈ లేఖలో పేర్కొన్నారు. యమునా నదిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామంటూ ప్రజలకు వాగ్దానం ఇచ్చామని, దాన్ని నెరవేర్చలేకపోతున్నామని తేల్చి చెప్పారు. హామీలను అమలు చేయకపోవడం వల్ల సామన్యులు పార్టీ, మంత్రులు, అధికార యంత్రాంగాన్ని నిలదీసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. క్రమంగా సామాన్యుల నమ్మకాన్ని పోగొట్టుకుంటోన్నామని కైలాష్ గెహ్లాట్ చెప్పారు. భారతీయ జనతా పార్టీ సారథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సంకీర్ణ కూటమి ప్రభుత్వంతో కొట్లాడటానికే పార్టీ, ప్రభుత్వం సమయం మొత్తం కేటాయిస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో తనకు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, మంత్రి పదవికి రాజీనామా చేయడం మినహా మరో మార్గం లేదని కైలాష్ గెహ్లాట్ స్పష్టం చేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని, తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని ఆయన అరవింద్ కేజ్రీవాల్‌కు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో ఇద్దరు ముఖ్యమంత్రులు

రెండు రోజులు కనిపించకపోతే ఇంత రాద్ధాంతం చేయాలా అంటూ బీఆర్ఎస్ శ్రేణులపై బండి సంజయ్ మండిపడ్డారు. లేచినా, పడుకున్నా బీఆర్ఎస్ నేతలకు తానే గుర్తుకువస్తున్నాన్నని వాళ్ల సంగతి చెబుదామనే వచ్చినట్టు వివరించారు. వికారాబాద్ కలెక్టర్ దాడిపై స్పందించిన బండి సంజయ్ అది దారుణమైన చర్యగా అభివర్ణించారు. అయితే కలెక్టర్ మీద దాడి చేసింది రైతులు కాదనీ దాడి వెనుక కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు ఉన్నారని కాంగ్రెస్ చెప్పినట్టుగా గుర్తు చేశారు. ఇది ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని తెలిపారు. కేసీఆర్ కొడుకు కేటీఆర్ నటసార్వభౌముడని చెప్పుకొచ్చారు. కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ హైకమాండ్‌ని కలిశారంటూ కీలక ఆరోపణలు చేశారు. గతంలోనూ కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుని ఇలాగే నీరుగార్చారని బండి సంజయ్ గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్ అనేది సిరిసిల్ల కేంద్రంగానే జరిగిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌కు తెలియకుండానే అంత వ్యవహారం జరిగిందా అని ప్రశ్నించారు. అప్పుడు, ఇప్పుడు సీఎం కేటీఆరే అని చెప్పుకొచ్చారు. దీపావళి బాంబులు ఎక్కడికి పోయాయి అంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు.

ఈ–ఫార్ములా రేసింగ్ కేసు, ధరణి కేసు, జన్వాడ ఫామ్ హౌస్ కేసు, డ్రగ్స్ కేసు ఇవన్నీ ఎక్కడికి పోయాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. తెలంగాణకు ఇద్దరు ముఖ్యమంత్రులని ఒకటి రేవంత్ రెడ్డి అయితే రెండో సీఎం కేటీఆర్ అని బండి సంజయ్ కీలక ఆరోపణలు చేశారు. రేవంత్ కుటుంబానికి, కేసీఆర్ కుటుంబానికి సంబంధం లేదని నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని బండి సంజయ్ సవాల్ విసిరారు. తాను నిరూపించేందుకు సిద్ధమని మీరు రెడీనా అంటూ ఛాలెంజ్ చేశారు. తెలంగాణలో ఆర్కే పాలన నడుస్తుందని విమర్శించారు. తెలంగాణలో బీజేపీని అడ్డుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి నాటకాలు ఆడుతున్నాయన్నారు. మూసీ పేరుతో లక్షల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తుందని ఆరోపించారు. దానికి తాము వ్యతిరేకమన్నారు. పేదల ఇండ్లు కూల్చవద్దని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై స్పందించిన బండి సంజయ్ తాను కేంద్ర మంత్రినని, తనకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చే అవకాశం లేదని క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతుంటే సజావుగా కొనసాగుతుందంటున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు సజావుగా సాగితే ముక్కు నేలకు రాస్తా మీరు రేడినా అంటూ మరో సవాల్ విసిరారు. రైతుల సమస్యను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని విమర్శించారు. లగచర్ల ఫార్మసిటీకి కూడా తాము వ్యతిరేకం కాదన్న బండి సంజయ్ రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని బండి సంజయ్ సూచించారు.

# బాధితులకు కొండంత అండ

ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ బీఆర్ఎస్‌తో పొత్తుల ప్రసక్తే లేదని స్పష్టం చేశారు కిషన్ రెడ్డి. బీఆర్ఎస్‌తో కలిసి బీజేపీ నేతలు మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు తిప్పికొట్టారు. అసలు బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. ఇప్పుడు కూడా చాలా మంది ఆ గులాబీ నేతలు కాంగ్రెస్‌లో చేరారని గుర్తు చేశారు. బీజేపీ మాత్రం బీఆర్ఎస్‌తో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని తేల్చి చెప్పారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీతో పొత్తు అంశమే ప్రస్తావనకు రాలేదని అసలు అలాంటి ఆలోచనే లేదన్నారు కిషన్ రెడ్డి. భవిష్యత్‌లో కూడా బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే పరిస్థితి ఉండబోదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం గతంలో బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసిందని అందుకే ఇద్దరి డీఎన్ఏలు ఒకటే అని విమర్శించారు కిషన్ రెడ్డి. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన రెండు పార్టీలకూ లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను తాము స్వీకరించామని మూసీ పరిసర ప్రాంతాల్లోని బస్తీల్లో తమ నేతలంతా నిద్ర చేశారని అన్నారు. తులసీరామ్ నగర్‌లో కిషన్ రెడ్డి, మలక్‌పేట్‌లో లక్ష్మణ్, ఎల్‌బీ నగర్‌లో ఈటల రాజేందర్, హైదర్ షా కోట్‌లో ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, కార్వాన్‌లో సీతారాం నాయక్, రామాంతపూర్‌లో ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఈ బస్తీ నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంటనే మూసీ ప్రక్షాళన ఆపేయాలన్నారు. పేదల ఇళ్లు కూల్చకుండా కూడా నదిని ప్రక్షాళ చేయవచ్చని సూచించారు. ఒక రిటైనింగ్ వాల్ నిర్మిస్తే చాలా వరకు పరిస్థితిలో మార్పు వస్తుందని తెలిపారు. ఆ దిశగా ప్రభుత్వం ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. పనులను చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో వేల ప్రార్థనామందిరాలు, ఆలయాలతోపాటు పేదల ఇళ్లు కూల్చివేతను తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు కిషన్ రెడ్డి. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఘాటుగా స్పందించింది. సకల సౌకర్యాలతో ఒకరు రోజు నిద్ర చేయడం కాదని మూడు నెలలు అక్కడ జీవనం సాగించాలని అన్నారు. అప్పుడే అసలు అక్కడ ప్రజలు పడుతున్న బాధలు తెలుస్తాయన్నారు. ఆరు నెలలు ఉండాలని సీఎం చెప్పారని ఒకరు నిద్ర చేసి సవాల్ స్వీకరించామంటే ఎలా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ, బీఆర్ఎస్ ఇలా కలిసి ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. దొంగ నిద్రలతో బీజేపీ నేతలు ప్రజలను మోసం చేస్తున్నాని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన ఆపాలని కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా మూసీ కంపులో బతకాలని ఆకాంక్షిస్తున్నరాని ధ్వజమెత్తారు. మొత్తానికి బస్తీ నిద్రతో సైలెంట్‌గా ఉన్న మూసీ ప్రక్షాళన మరోసారి తెరపైకి వచ్చింది. ఇన్ని రోజులు బీఆర్ఎస్ నేతలు బాధితులను కలుస్తూ వారి పక్షాన మాట్లాడారు. ఇప్పుడు సీన్‌లోకి బీజేపీ నేతలు వచ్చారు. ఇన్ని రోజులు ఒకరిద్దరు మూసీ అంశంపై మాట్లాడుతున్నా పెద్దగా ఫోకస్ రాలేదు. ఇప్పుడు బస్తీ నిద్రతో లైమ్‌లైట్‌లోకి వచ్చారు.

# తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ

2020–2030 ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ తీసుకొచ్చారు. జీవో నెంబర్ 41 ద్వారా 2026 డిసెంబర్ 31 వరకు ఉంటుంది. టూవీలర్స్, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ బస్సులకు 100 శాతం పన్ను మినహాయింపు. జంట నగరాల్లో ఈవీ బస్సులు తీసుకొస్తున్నాం. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పరిమితి లేదు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మార్చాలని ప్రణాళికలు తెచ్చాం.' అని పేర్కొన్నారు.

**- ఈవీలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

కాలుష్యాన్ని తగ్గించాలంటే ఈవీలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'హైదరాబాద్‌లో ఇప్పుడున్న 3 వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తేవాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే సిటీలో మొత్తం ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. తెలంగాణ ప్రజలు ఈవీ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వాహనాలు 15 ఏళ్లు దాటిన వాటికి స్క్రాప్ చేయాలని పాలసీ తెచ్చాం. వాహన సారథిలో కూడా 29 రాష్ట్రాల్లో తెలంగాణ చేరుతుంది. వాహనదారులు పొల్యూషన్ టెస్ట్ చేసుకునేలా అవగాహన కల్పించాలి. రోడ్ సేఫ్టీపై గురువారెడ్డి సంస్థ లైసెన్స్ ఇచ్చే ముందే అవగాహన కల్పించాలని నిర్ణయం తీసుకుంది. యునిసెఫ్ ద్వారా స్కూళ్లలో రోడ్డు అవేర్నెస్ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. రవాణా శాఖకు కొత్త లోగో వస్తుంది. కొత్త వాహనాలు వస్తున్నాయి. రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలకు అనుగుణంగా ఛార్జింగ్ స్టేషన్స్ ఉంటున్నాయి. ఈవీ కంపెనీలు చొరవ తీసుకొని ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి. ఇప్పటివరకూ 1.70 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. వచ్చే 10 రోజుల్లో రవాణా శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఏ, హైదరాబాద్ పోలీసులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తాం. పొల్యూషన్ చెకప్ చేసే వాహనాలు సరిగా చేయడం లేదనే ఆటోమాటిక్ టెస్టింగ్ సెంటర్స్ తీసుకొస్తున్నాం. ఇప్పటికే రవాణా శాఖలో కానిస్టేబుల్స్, ఏఎంవీఐల నియామకం జరిగింది. అర్హులందరికీ ప్రమోషన్లు కల్పిస్తాం. క్వాలిటీ ఆఫ్ ప్రొడక్షన్ కంపెనీ బాధ్యత. ఎలక్ట్రిక్ వెహికల్ ఎక్కడైనా ఒకటి ప్రమాదం జరిగితే ప్రజల మధ్య అపోహ సృష్టించద్దు.' అని పొన్నం పేర్కొన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న చలి

కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లిలో నవంబర్ 19, 20 తేదీల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. హైదరాబాద్‌లో, నవంబర్ 20 వరకు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉదయం వేళల్లో పొగమంచు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది.శనివారం నల్గొండ, నిజామాబాద్, నారాయణపేట, సూర్యాపేట, కుమురం భీమ్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్–మల్కాజిగిరి, ఖమ్మం, కరీంనగర్, సంగారెడ్డిలో 0.5 మి.మీ నుంచి 3.8 మి.మీ వరకు తేలికపాటి వర్షం కురిసిందని తెలిపింది. పలు జిల్లాల్లో 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు కూడా నమోదయ్యాయి.

అయితే హైదరాబాద్‌లో మాత్రం కనిష్ట ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదయ్యాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. వచ్చే నెల రోజుల్లో హైదరాబాద్ లో కూడా ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉన్నట్లు వివరించింది. ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది. చలికాలం జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు చలికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. రాత్రి, తెల్లవారుజామున బయటకు వెళ్లకూడదని చెబుతున్నారు. మందపాటి దుస్తువులు ధరించాలని వివరిస్తున్నారు. చెవుల్లోకి చలి గాలి వెళ్లకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు.

# రాజకీయ నేతల అహం దెబ్బ తింటోందా.?

అత్యంత దారుణంగా మాట్లాడారు. సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. ఇలాంటి పరిస్థితులే జగన్ ఓటమికి ఓ కారణమయ్యాయి. ఆయన పథకాల ద్వారా ఎంత దగ్గరయినా. ఇలాంటి చేతల ద్వారా మరింత దూరమయ్యారు. మాజీ స్పీకర్ కోడెల విషయంలో, చంద్రబాబు కుటుంబ సభ్యుల విషయంలో వారి తీరు అత్యంత దారుణంగా ఉంది. ప్రస్తుతం కూడా చంద్రబాబు ముఖం చూడలేనని పంతం పట్టినట్లుగానే జగన్ రాజకీయాలు ఉన్నాయి. ఇప్పుడు సీఎం గా చంద్రబాబు ఉన్న నేపథ్యంలోతాను అసెంబ్లీకి రానని పంతం పట్టారు. ఇది అత్యంత దారుణమైన పరిస్థితి. గతంలో ఇలాంటి రాజకీయాలు చూడలేదని సీనియర్లు చెబుతున్నారు. ఏదేమైనా ఇలాంటి రాజకీయాలు సమాజానికి మేలు చేసేవి కావని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ నాయకుల మధ్య కేవలం రాజకీయ వైరం మాత్రమే ఉండాలని , వ్యక్తిగత, కక్షపూరిత రాజకీయాలకు తావు ఉండొద్దని చెబుతున్నారు. తమిళనాడులో కూడా ఇలాంటి వ్యక్తిగత రాజకీయాలు కొన్నాళ్లు సాగాయి. అయితే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కూడా దాదాపు అలాంటి పరిస్థితే ఉందని రాజకీయాల్లో సీనియర్లు కొందరు అభిప్రాయపడుతున్నారు. మరి రానున్న రోజుల్లో మరెన్నీ నీచమైన మాటలు, చేతలు ఈ రాజకీయాల్లో చూడాల్సి వస్తుందో అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# వెంటనే స్థలం ఖాళీ చేయండి

## - వందేళ్ల లాలాగూడ చర్చికి రైల్వే ఎవిక్షన్ నోటీసులు



తార్నాక (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ లాలాగూడలోని శాక్రిడ్ హార్ట్ క్యాథలిక్ చర్చికి రైల్వే అధికారులు షాక్ ఇచ్చారు. వెంటనే ఈ స్థలాన్ని ఖాళీ చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఎవిక్షన్ నోటీసులను జారీ చేశారు. ఈ నోటీసుల పట్ల క్రైస్తవ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తోన్నాయి. లాలాగూడలో సుమారు వందేళ్ల కిందట ఈ క్యాథలిక్ చర్చి నిర్మితమైంది. 1927లో నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. అప్పట్లోనే దీన్ని నిర్మించడానికి 7,000 రూపాయలు వ్యయం చేసినట్లు చెబుతున్నారు. దీని నిర్మాణానికి అప్పటి నిజాం నవాబుల ప్రభుత్వం 1,000 రూపాయలను విరాళంగా ఇచ్చింది. ఈ చర్చి స్థలం తమకు చెందినదని, ఎలాంటి అనుమతులు లేకుండా దీన్ని నిర్మించారని రైల్వే మంత్రిత్వ శాఖ చెబుతోంది. ఈ స్థలాన్ని ఖాళీ చేయాలంటూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నోటీసులు ఇచ్చినట్లు ఒక పత్రిక ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. స్థలాన్ని ఖాళీ చేయడానికి నెల రోజుల గడువు ఇచ్చారు రైల్వే అధికారులు. అలా చేయకపోతే పబ్లిక్ ప్రెమిసెస్ (ఆక్రమణదారుల తొలగింపు) చట్టం– 1971 ప్రకారం తొలగింపు ప్రక్రియను చేపడతామని, అలాగే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలను తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. లల్లాగూడ ఎస్ఎల్‌డీజీ ఆఫీసర్స్ అండ్ స్టాఫ్ కాలనీలో ఉన్న తమ భూమిలో ఈ చర్చిని చట్టవిరుద్ధంగా నిర్మించారని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ నోటీసుల్లో స్పష్టం చేశారు. నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే కంపెనీకి చెందిన లోకో హెడ్ క్వార్టర్స్‌గా ఉంటూ వస్తోంది లల్లాగూడ. 1927 ఫిబ్రవరిలో అప్పటి రైల్వే అధికారులు చర్చి నిర్మాణానికి కొంత స్థలాన్ని కేటాయించారని, ఈ మేరకు ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నాయని టైమ్స్ ఆఫ్ ఇండియా తన కథనంలో పేర్కొంది. చర్చి నిర్మాణానికి 1927 మార్చిలో అనుమతులు జారీ అయ్యాయని, అదే సంవత్సరం జూలైలో నిర్మాణాన్ని ప్రారంభించారు. ఆ తరువాత అందులో మార్పులు చేర్పులు చోటు చేసుకుంటూ వచ్చాయి. ఫాదర్ మదను ఆరోగ్యం, ఆర్చ్ బిషప్ సామినేని అరులప్ప ఫాదర్ చొప్పరపు ఆరోగ్యం, ఆర్చ్ బిషప్ మారంపూడి జోజి క్రమంగా దీన్ని విస్తరించారు.

## గుంటూరు మేయర్‌పై కేసు నమోదు.. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను

# దూషించినందుకు స్టేషన్‌లో ఫిర్యాదు



అమరావతి : వైసీపీ ఐదేళ్ల పాలనలో టీడీపీ, జనసేన నాయకులపై జరిగిన అరాచకాలపై కూటమి ప్రభుత్వంలో వరుసగా ఫిర్యాదులు వస్తుండడంతో పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన ముఖ్య నాయకులపై కేసులు నమోదు అవుతున్నాయి. ఇప్పటికే సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వైసీపీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు ప్రధాన నాయకులపై కేసులు కడుతున్నారు.నిన్న మాజీ మంత్రి కొడాలినానిపై కేసు నమోదు కాగా తాజాగా వైసీపీ నాయకుడు, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో వైసీపీ పాలనలో చంద్రబాబు అరెస్టు సందర్భంగా టీడీపీ ,జనసేన నిర్వహించిన ఆందోళనపై మేయర్ పోలీసుల లాఠీ తీసుకుని టీడీపీ, జనసేన నాయకులను దూషిస్తూ దాడికి యత్నించారు. టీడీపీ నాయకులు అప్పుడే ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మరోసారి స్థానిక టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో మేయర్‌తో పాటు వైసీపీ నాయకులపై కేసు నమోదు చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిపై కేసు నమోదు అయ్యింది.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 10 గంటల సమయం

తిరుమల : తిరుమలలో శ్రీనివాసుడి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు 17 కంపార్టుమెంట్లలో వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 73,179 మంది భక్తులు దర్శించుకోగా 25,602 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.03 కోట్లు వచ్చిందని వెల్లడించారు.

# టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్‌అఫీసియో సభ్యుడిగా ఈవో ప్రమాణం

తిరుమల : టీటీడీ ఈవో శ్యామలరావు టీటీడీ ఎక్స్‌అఫీసియో సభ్యుడిగా ఆదివారం ప్రమాణం చేశారు. తిరుమలలోని బంగారు వాకిలి వద్ద అదనపు ఈవో ప్రమాణం ఆయనతో స్వీకారం చేయించారు. అనంతరం ఈవోకు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈవో మాట్లాడుతూ ఎక్స్‌అఫీసియో సభ్యుడిగా అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన ఐదునెలల్లో టీటీడీలో అనేక మార్పులు చేశామని వివరించారు

అన్నప్రసాదాలు, ఐటీ విభాగాల్లో మార్పులకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఇటీవల బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించామని చెప్పారు. కొత్త పాలకమండలిలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు.

# సంస్కారాలు



గృహస్థ పాటించాల్సిన సంస్కారాల గురించి మనకు మన ప్రాచీన మహర్షులు గృహ్య సూత్రాల రూపంలో, కొన్ని వేల సంవత్సరాల క్రితమే చెప్పి ఉన్నారు. సంస్కారం అంటేనే సంస్కరించునది అని అర్థం. అంటే, ఈ సంస్కారాలు పాటించడం ద్వారా మనిషి సంస్కారవంతుడు అగుచున్నాడు. ఏవిధంగా అయితే మట్టిలో ఇతర ఖనిజలవణాలతో కలిసిపోయి దాదాపుగా మట్టిలాగే దొరికిన బంగారం, సంస్కరించబడి, అనుభవయోగ్యమైన సువర్ణంగా, ఆభరణాలుగా మారుతుందో, అలాగే మనిషి కూడా సంస్కారాలు పాటించడంద్వారా ఉన్నతమైన జీవన విధానాన్ని, పరిపక్వమైన మానసికస్థితిని పొందుచున్నాడు. తద్వారా సమస్తజనాలూ సుఖసంతోషాలతో నివసించగలిగేలా క్రమశిక్షణతో కూడిన నడవడికగల ఒక సర్వోన్నత ధార్మికసమాజాన్ని నిర్మించగలిగాడు. సంస్కారాల సంఖ్యగురించి అభిప్రాయ భేదాలున్నా, లోకంలో ప్రాచుర్యంపొందినవి మాత్రం పదహారే. ఈ పదహారు రకాల సంస్కారాల గురించి, అవి అనుసరించాల్సిన సమయాల గురించి, వాటి విధానాల గురించి, ఈ వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకుందాం. మనిషికి ఈ సంస్కారాలు జరిగినట్లుగా మనకంటికి ఏమైనా మార్పులు కనిపిస్తాయా? అంటే కొన్ని సంస్కారాల తాలూకు మార్పులు కంటికి కనిపిస్తాయి, కొన్ని కనిపించవు. ఎందుకంటే, కొన్ని సంస్కారాలు శరీర సంబంధ వేషభాషలలో మార్పులు తీసుకొస్తే, కొన్ని సంస్కారాలు మానసిక పరిపక్వతనీ, ఉన్నతమైన ఆలోచనావిధానాన్నీ, సామాజిక శ్రేయస్సును కలిగిస్తాయి. శరీర సంబంధ మార్పులు కంటికి కనిపిస్తాయి, కానీ మానసికమైన మార్పులు మాత్రం వారి ప్రవర్తనలో, మాట్లాడే విధానంలో, ఎదుటివారిని గౌరవించే తీరులో, వారు తీసుకునే నిర్ణయాలలో ప్రతిబింబిస్తాయి. ఏది ఏమైనా, 'వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ వకారైః పంచభిర్యుక్తః నరోభవతి పూజితః' అను ఆర్యోక్తిని అనుసరించి, ఒక వ్యక్తి గౌరవించబడాలంటే, పంచవకారాలైన వస్త్రం, వేషభాషలు, విద్యా వినయాలను పాటించాలి. వాటిని నేర్పించేది కూడా ఈ సంస్కారాలే. గర్భాధానం మొదలుగాగల పదిహేను సంస్కారాలు మనిషి జీవించి వుండగా జరిపించేవి కాగా, పదహారవ సంస్కారమైన అంత్యేష్టిమాత్రం మనిషి మరణించిన తరువాత జరిపించేది. ఇది మానవశరీరాన్ని అగ్ని మొదలైన పంచభూతాలకు హవిస్సుగా అర్పించే పరమ పవిత్రమైన సంస్కారంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. దాదాపుగా ప్రతి సంస్కారమూ అగ్నిని ఆధారంగాచేసుకునే జరపాలని సమస్త గృహ్యశాస్త్రాలూ చెప్తున్నాయి. సంస్కారాల వలన సంస్కరింపబడి, దయ ఓర్పు మొదలైన ఆత్మగుణాలు కలిగినవారు పరమపదాన్ని పొందుతారని స్మృతులు చెప్తున్నాయి. సంస్కారాల వరుసక్రమంలో అభిప్రాయ భేదాలున్నా, దాదాపుగా అందరూ అంగీకరించిన వరుసక్రమాన్ని అనుసరించే వాటిని వివరించడం జరుగుతుంది.

# వజ్రాల సీతాకోక చిలుకల బ్యాగు.. విలువెంతో తెలుసా!



రోమ్: సాధారణంగా ఓ హ్యాండ్ బ్యాగు ఖరీదు 500 రూపాయల నుంచి ప్రారంభమై వేలల్లో ఉంటుంది. ఇక కొన్ని ప్రత్యేకమైన బ్రాండ్స్‌కు చెందిన ఫ్యాషన్ హ్యాండ్ బ్యాగుల విలువ లక్షల్లో ఉంటుంది. కానీ ఇటలీకి చెందిన ఓ బ్యాగుల కంపెని ఇటీవల తయారు చేసిన బ్యాగు విలువ తెలిస్తే అందరూ నోళ్లు వెల్లబెట్టాల్సిందే. అలిగేటర్(మొసలి జాతికి చెందిన) చర్మంతో తయారు చేసిన ఈ చిన్న బ్యాగు విలువ రూ. 53 కోట్లు అంట. దీంతో ప్రస్తుతం ఇది ప్రపంచంలోని అంత్యంత ఖరీదైన బ్యాగు అయ్యింది. అయితే దానికి ఎందుకు అంతా ఖరీదు అని ఆలోచిస్తున్నారు. ఎందుకంటే ఈ బ్యాగును వజ్రాలు, మరకత మాణిక్యాలతో పాటు విలువైన రాళ్లతో అలంకరించారు. దీనిని బోరిని మిలానేసి అనే లగ్జరీ లెదర్ హ్యాండ్ బ్యాగుల కంపెనీ తయారు చేసింది. చూడగానే కళ్లు చెదరిలా తయారు చేసిన ఈ బ్యాగును అలిగేటర్ చర్మంతో తయారు చేసిన ఈ బ్యాగుపై తెల్లరంగు బంగారంతో తయారు చేసిన 11 సీతాకోక చిలుకలను అమర్చారు. ఈ సీతాకోక చిలుకలపై మొత్తం 30 క్యారట్ల వజ్రవైఢూర్యాలు, అరుదైన మరకత మాణిక్యాలను పొదిగారు. అయితే ఈ బ్యాగు తయారు చేసేందుకు దాదాపు 1000 గంటలకు పైగా సమయంలో పట్టిందని ఈ సంస్థ వెల్లడించింది. దీనితోపాటు ఇలాంటివే మరో రెండు బ్యాగులను కూడా ఈ సంస్థ తయారు చేసింది. కాగా ఖరీదైన ఈ హ్యాండ్ బ్యాగులను మహాసముద్రాల కాలుష్యంపై అవగాహన కలిగించేందు కోసమే తయారు చేసినట్లు బోరిని మిలానేసి సంస్థ తెలిపింది. వీటి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును సముద్ర కాలుష్య నివారణకు వినియోగిస్తామని ఈ సంస్థ వెల్లడించింది. అయితే దీనిని ఇంతవరకు ఎవరూ ఖరీదు చేయలేదని ఆ సంస్థ పేర్కొంది. ప్రపంచలోనే అంత్యంత ఖరీదైన ఈ బ్యాగును ఏ సంపన్నులు సొంతం చేసుకుంటారో వేచి చూడాలి.

# పుష్కరతుంగ... భద్రగంగ




వరాహరూపుడైన విష్ణువు కుడి కోర నుండి కారిన లాలాజలం భద్రానదిగానూ ఉద్భవించాయి. పుష్కరాలు జరిగే 12 నదులలో తుంగభద్ర ఒకటి. రాష్ట్రంలో చివరి తుంగభద్ర పుష్కరాలు 2008 లో జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి తుంగభద్ర పుష్కరాలు ఇవే. నవగ్రహాల్లో ఒకటైన గురు గ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటుంది. బృహస్పతి మకరరాశిలో ప్రవేశించే సమయంలో తుంగభద్ర నదికి పుష్కరాలు నిర్వహిస్తారు. ఈ పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ముక్కోటి దేవతలు ఆ నదిలో కొలువై ఉంటారని, ఈ సమయంలో ఆ నదిలో స్నానమాచరించిన వారి పాపాలు తొలిగి.. పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ప్రముఖ దేవాలయాలను తాకుతూ వెళుతున్న తుంగభద్ర.. కర్ణాటక: శృంగేరి (చిక్మగుళూరు), పంపావతి దేవాలయం(కంప్లి), హరిహరేశ్వర దేవాలయం(హంపి). ఆంధ్రప్రదేశ్: రాఘవేంద్రస్వామి ఆలయం, (మంత్రాలయం), శివరామాలయం (గుండ్రేవుల). తెలంగాణ: సంతాన వేణుగోపాలస్వామి ఆలయం (వేణిసోంపురం), వైకుంఠ నారాయణ స్వామి ఆలయం (రాజోళి), సూర్యనారాయణ స్వామి ఆలయం (పుల్లూరు), జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు (అలంపూర్), సంగమేశ్వరాలయం. తుంగ, భద్ర నదులు కలసి కర్ణాటక రాష్ట్రంలోని పశ్చిమ కనుమల నుంచి ప్రవహిస్తాయి. ఈ రెండు నదులు కలిసి తుంగభద్ర నదిగా మారి.. కర్ణాటకలో కృష్ణా పరివాహక ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళగనూరు వద్ద ప్రవేశిస్తుంది. తెలంగాణలో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కుట్కనూరు వద్ద తుంగభద్ర రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం పులికల్, రాజోళి, పుల్లూరు మీదుగా సాగుతూ నదీతీరంలో కొలువైన దేవతల పాదాలను అభిషేకిస్తూ.. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. తుంగభద్ర నది రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించి సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో సంగమం అవుతున్నది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురువడంతో తుంగభద్ర నది జలకళను సంతరించుకుంది.

జలాన్ని దేవతా రూపంలో తల్లిగా భావించి పూజించడం హిందువుల సంప్రదాయం. నదీస్నానాలు, కోనేటి స్నానాలు, మంగళ స్నానాలు, సముద్ర స్నానాలు... అలాగే తీర్థ యాత్రలు, పుణ్య క్షేత్రాలు దర్శనం... సమస్తం నీటితో ముడిపడి వున్నాయి. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్య ప్రదమని హిందువుల విశ్వాసం. సకల జీవరాశులకు ప్రధానమైన జలస్నానం ప్రాముఖ్యతను గుర్తుచేసేవే పుష్కరాలు. 'తుంగే పానీ.. గంగే స్నానే' అన్నది ఆర్యోక్తి. గంగానదిలో స్నానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర జలాలు తాగితే అంతే పుణ్యం వస్తుందని దీనికి అర్థం! అసలు తుంగభద్ర నది ఎలా ఏర్పడిందో తెలుసుకుందాం. హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టి సముద్రంలో వేయగా శ్రీ మహావిష్ణువు వరాహావతారమెత్తి తన కోరలతో భూమిని సాగరం నుండి పైకెత్తి సర్వజీవులనూ రక్షించాడు. తుంగ (ఎత్తు) నుండి రావడం వల్ల తుంగానదిగానూ, హిరణ్యాక్షుని సంహరించే సమయంలో

# చేపలో ఎన్ని పోషాకాలున్నాయో.. తెలుసా...?

హైదరాబాద్ : చేపల పులుసే కాదు, చేపల వేపుడు కూడా అద్భుతంగానే ఉంటుంది. అయితే ఏదో ఒక రూపంలో చేపలను వారంలో కనీసం 2 లేదా 3 సార్లు తీసుకుంటే మనకు అనేక అద్భుతమైన లాభాలు కలుగుతాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం. వయస్సు మీద పడడం వల్ల ఎవరికైనా సహజంగానే మతిమరుపు వస్తుంటుంది. కొందరికి ఇది తీవ్రతరమై అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అలాంటి సమస్య ఉన్నవారు చేపలను తినడం వల్ల ఆ సమస్య నుంచి బయట పడవచ్చని 2016లో పలువురు అమెరికన్ సైంటిస్టులు చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. చేపలను తినడం వల్ల మెదడు బాగా పనిచేస్తుందట. జ్ఞాపకశక్తి పెరుగుతుందని వారు చెబుతున్నారు. –చేపలను బాగా తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ కార్డియాలజీలో ఓ అధ్యయన వివరాలను ప్రచురించారు. చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తంలో ఉండే ట్రై గ్లిజరైడ్లను తగ్గిస్తాయి. దీంతో రక్తనాళాల్లో ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా, గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. –చేపలను తరచూ తినడం వల్ల వాటిల్లో ఉండే డోపమైన్, సెరొటోనిన్ అనే హార్మోన్లు డిప్రెషన్‌ను తగ్గిస్తాయి. నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతాయని సైంటిస్టుల పరిశోధనల్లో వెల్లడైంది. –చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. అలాగే పెద్దపేగు, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పాంక్రియాటిక్ క్యాన్సర్ తదితర క్యాన్సర్లు రాకుండా ఉంటాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ఓ అధ్యయ వివరాలను ప్రచురించారు.



# ప్రకృతిని పరిరక్షించుకోకపోతే విపత్తులు తప్పవు

**- తిండిగింజలు - 2.3 కోట్ల టన్నులు - కూరగాయలు - 2.1 కోట్ల టన్నులు - ఏటా మనం వృథా చేస్తున్న ఉత్పత్తులు (ఆహార శుద్ధీకరణ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం...)**

**- పండ్లు- 1.2 కోట్ల టన్నులు - ఈ వృథా మొత్తం విలువ - 440 కోట్ల డాలర్లు (రూ. 32,329 కోట్లు) - ఈ ఆహార వృథా ద్వారా ఉత్పత్తి అయ్యే చెత్తను కూడా పరిగణనలోకి తీసుకుంటే విలువ: 1,060 కోట్ల డాలర్లు(రూ. 77,885 కోట్లు)**

**68 శాతం..** 1970 - 2016 మధ్యకాలంలో తగ్గిపోయిన క్షీరదాలు, పక్షులు, ఉభయ చరాలు, సరిసృపాలు, చేపల సంతతి

**49 శాతం..** భారత్‌లో కేవలం రెండేళ్లలోనే కాలుష్యం బారిన పడ్డ నదీ ప్రవాహాలు. ఢిల్లీలో యమున, దామన్ లోని దామన్ గంగ, ముంబైలోని మీఠీ, హరియాణాలో గగ్గర్, గంగా నదిలోని పలు ప్రాంతాలు ఇందులో ఉన్నాయి.

**భారత్‌లో క్షీణత...** క్షీరదాల సంతతిలో తగ్గదల 12 శాతం. కప్పల వంటి ఉభయ చరాల్లో 19 శాతం క్షీణత. పక్షుల్లో 3 శాతం తగ్గుదల.

**85 శాతం..** మనిషి కోల్పోయిన చిత్తడినేలల విస్తీర్ణం

**1,000** గంగ నదీ పరీవాహక ప్రాంతంలో ఉపనదులు, ఇతర జల వనరుల ప్రవాహాన్ని అడ్డుకుంటున్న ఆనకట్టల సంఖ్య

**3** తాబేళ్ల వినాశనం విషయంలో భారత్ ర్యాంకు. చైనా, వియత్నాంలో మనకంటే ఎక్కువ విధ్వంసం జరుగుతోంది!

**21.000** లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ (ఎల్‌పీఐ)లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గమనిస్తున్న జంతుజాలాల సంఖ్య

**0.03 శాతం..** దేశ భౌగోళిక విస్తీర్ణంలో చిత్తడి నేలలు.

**2,500** మన జీవనదుల్లో మిగిలిన గాంజెటిక్ డాల్ఫిన్ల సంఖ్య!

**82 కోట్లు** దేశంలోని 12 నదీ పరీవాహక ప్రాంతాల్లో నీటి సమస్య ఎదుర్కొంటున్న జనాభా.

**గొరిల్లాలు.. బూడిద రంగు చిలకలు** ప్రమాదం అంచుల్లోన ఉన్న జంతుజాలంలో ఇవి రెండు మాత్రమే. ఇంకా అనేకం ఉన్నాయి.

హరివిల్లులో ఏడు రంగుల స్థానంలో ఒక రంగు మాత్రమే ఉంటే? భూమ్మీద తెల్లటి పూలు మాత్రమే పూస్తే? పండ్లు అన్నింటి రుచి ఒకేలా ఉంటే? అబ్బే... ఏం బాగుంటుంది అంటున్నారా? నిజమే. అన్నీ ఒకేలా ఉంటే బోర్ కొట్టేస్తుంది! వైవిధ్యం అనేది మనసుకు ఆనందం కలిగిస్తుంది! ప్రయోజనాలూ బోలెడు! కానీ.. ఈ విషయం మనిషికి పూర్తిగా అర్థమైనట్లు లేదు. ఎందుకంటే.. మన మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుందని తెలిసినా... వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ తదితరాల పేరుతో.... అడవులు, నదులు, సరస్సులు, నేలలను నాశనం చేస్తూనే ఉన్నాడు! వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సిద్ధం చేసిన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ –2020 చెబుతున్నది ఇదే! కోవిడ్ మహమ్మారి విజృంభణ కొనసాగుతూనే ఉంది. కోట్ల కేసులు.. లక్షల్లో మరణాలు... ఆర్థిక వ్యవస్థ ఛిద్రం.. ఉద్యోగాల కోత. ఇలా ఎన్నెన్నో సమస్యలకు ఒక వైరస్ కారణమైందంటే ఆశ్చర్యం అనిపించక మానదు. కానీ.. కోట్ల సంవత్సరాలపాటు జంతువుల్లో నిక్షేపంగా బతికిన ఈ వైరస్‌లు ఈ మధ్య కాలంలో మనిషికి ఎందుకు సంక్రమిస్తున్నాయో.. కారణమేమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? హెచ్1ఎన్1 కానివ్వండి, చికెన్ గున్యా కానివ్వండి. స్వైన్‌ఫ్లూ కానివ్వండి అన్నీ జంతువుల నుంచి మనిషికి సోకిన వ్యాధులే. ఇప్పుడు కోవిడ్%––%19 కూడా. మనిషి ఎప్పుడైతే అటవీ సంపదను తన స్వార్థం కోసం విచ్చలవిడిగా వాడటం మొదలుపెట్టాడో అప్పటి నుంచే ఈ సమస్య కూడా పెరగడం మొదలైందని అంటారు నిపుణులు. ప్రకృతిని, జీవజాలాన్ని పరిరక్షించుకోవడం ఇప్పటికైనా నేర్చుకోకపోతే కోవిడ్%––%19 తరహా విపత్తులు మరిన్ని ఎదుర్కోక తప్పదని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ %––%2020లో స్పష్టం చేసింది. రెండేళ్లకు ఒకసారి విడుదల చేసే లివింగ్ ప్లానెట్ రిపోర్ట్‌ను ఈసారి దాదాపు 125 మంది నిపుణులు కలిసి సిద్ధం చేశారు. 1970 నుంచి 2016 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 21 వేల క్షీరదాలు, పక్షులు, జలచరాలు, సరిసృపాలు సంతతిని పరిశీలిస్తూ సిద్ధం చేసిన ఈ నివేదిక దాదాపు 164 పేజీల నిడివి ఉంది. ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యూడబ్ల్యూఎఫ్ పరిశీలించిన వాటిల్లో మూడింట రెండు వంతుల జంతుజాలం క్షీణావస్థలో ఉంది. మొక్కల విషయానికొస్తే... ప్రతి ఐదింటిలో ఒకటి అంతరించిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు నివేదిక చెబుతోంది. గత ఏడాది ఉష్ణమండల ప్రాంతాల్లోని అడవులనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆరుసెకన్లకు రెండు ఎకరాల చొప్పున నష్టపోయామని నివేదిక తెలిపింది. అడవులు నరికివేసి వ్యవసాయం చేయడం మొదలుకొని నదీజలాల కాలుష్యంతో జలచరాలకు ముప్పు తేవడం వరకూ అన్నింటి ఫలితంగా భూమి ఇప్పుడు అత్యవసర సాయం కోరుతూ ఆక్రందనలు చేస్తోందని వివరించింది. ఈ పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోతే ఇంకో పదేళ్లలో సరిచేసుకునేందుకు వీలు కానంత పెద్ద ప్రమాదంలో పడతామని హెచ్చరించింది. అయితే ఇప్పటికైనా పరిస్థితి మించిపోలేదని, దేశాలన్నీ కలిసికట్టుగా పచ్చ'ధనం' పండిస్తే.. వినియోగం విషయంలో మనల్ని మనం మార్చు కోగలిగితే భూమి మరికొన్ని కాలాలపాటు పచ్చగా ఉండేందుకు అవకాశం లేకపోలేదని చెబుతోంది ఈ నివేదిక.

**ఇవీ కారణాలు** భూ వినియోగంలో మార్పులు. అటవీ విస్తీర్ణం వేగంగా తగ్గిపోతూ ఉండటం, జంతుజాలాల ఆవాస యోగ్య ప్రాంతాలు కుంచించుకుపోవడం జీవవైవిధ్యం తగ్గుదలకు ఒక కారణం. ప్రకృతి వనరుల విచ్చలవిడి వాడకం రెండో కారణం. ఇన్వేసివ్ స్పీషీస్ (ఇతర జీవావరణాల నుంచి వచ్చిన జంతువులు, పక్షులు, మొక్కలు) మూడో కారణం. నాలుగవ, ఐదవ కారణాలుగా కాలుష్యం, వాతావరణ మార్పులను పేర్కొనవచ్చు. భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జీవ వైవిధ్యతలో తగ్గుదలకు ప్రధానంగా వాటి ఆవాస ప్రాంత నష్టం కారణం కాగా.. ఇన్వేసివ్ స్పీషీస్, వ్యాధులు, అతి వాడకం ఇతర కారణాలుగా కనిపిస్తున్నాయి. భారత్‌లో నగరీకరణ, వ్యవసాయ కార్యకలాపాలు, కాలుష్యం వంటి కారణాల వల్ల చిత్తడి నేలలు దాదాపు లేకుండా పోయాయని లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ రిపోర్ట్ స్పష్టం చేసింది. అటవీ ప్రాంతాలు తగ్గడంతో జంతు సమూహాల్లోని సంఖ్య కూడా తగ్గిపోతోందని, ఇది కాస్తా సంతానోత్పత్తిపై ప్రభావం చూపడంతోపాటు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోందని ఈ నివేదిక తెలిపింది. గత ఏడాది భారత్‌లో అటవీ భూములను ఇతర అవసరాల కోసం మళ్లించాలన్న అభ్యర్థనలు దాదాపు 240 వరకూ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాగా.. సుమారు 99 శాతం ప్రతిపాదనలకు అనుమతి లభించిందని ఈ నివేదిక తెలిపింది.

**సమీకృత విధానంతోనే పరిష్కారం...** వేగంగా తగ్గిపోతున్న జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించాలన్నా, తద్వారా మానవ మనుగడను మరింత సుస్థిరం చేసుకోవాలన్నా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాల్సిందే. ఆహార ఉత్పత్తిని, వాణిజ్యాన్ని మరింత ప్రకృతి అనుకూలమైన పద్ధతుల్లో చేపట్టడం ఇందులో ఒకటి మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారంలో కనీసం మూడో వంతు వృథాగా చెత్తబుట్టల్లోకి చేరుతుండటం జీవవైవిధ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఈ వృథా కారణంగా గాల్లోకి చేరుతున్న విషవాయువులు వైమానిక రంగ ఉద్గారాల కంటే ఎక్కువగా ఆరు శాతం వరకూ ఉండటం గమనార్హం. ఆహార రంగం ద్వారా వెలువడుతున్న విషవాయువుల్లో 24 శాతం సరఫరా నష్టాలు, వినియోగదారులు వృథా చేయడమేనని నివేదిక తెలిపింది. ఈ నష్టాలన్నింటినీ తగ్గించుకోగలిగితే జీవవైవిధ్యం పెంపునకు తోడ్పడినట్లే. భారత్ విషయానికి వస్తే.. ఉత్పత్తి అవుతున్న ఆహారంలో వృథా అవుతున్నది దాదాపు 40 శాతం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటివి ఈ నష్టాన్ని 10 నుంచి 15 శాతంగా మాత్రమే చెబుతున్నా అంతర్జాతీయ సంస్థలు 40 శాతంగా లెక్కవేస్తున్నాయి. జంతుజాలాన్ని, ప్రకృతిని పరిరక్షించడం జీవవైవిధ్యం కోసం కీలకమైనప్పటికీ కేవలం ఈ చర్యల ద్వారా మాత్రమే పరిస్థితిని పారిశ్రామిక విప్లవం మునుపటి స్థాయికి తీసుకువెళ్లలేమని వీటికి ఇతర అంశాలూ కూడా జోడిస్తేనే మేలు జరుగుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.





## పెళ్లి పీటలు ఎక్కబోతున్న

# కీర్తి సురేశ్.?

దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరైన కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు అటు తమిళ మీడియాతో పాటు ఇటు తెలుగులో చక్కర్లు కొడుతున్నాయి. గీతాంజలి సినిమాతో మలయాళంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది ఈ భామ. ఈ చిత్రం అనంతరం ప్రభు కొడుకు విక్రమ్ ప్రభు నటించిన ఇది ఎన్న మాయం అనే సినిమాతో తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అదే ఇయర్‌లో నేను శైలజా అంటూ తెలుగులో వచ్చి సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత రజిని మురుగన్, భైరవ, మహానటి చిత్రాలతో బ్లాక్ బస్టర్‌లు అందుకుంది ఈ భామ. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుణ్ ధావన్‌తో బేబి జాన్ అనే సినిమాలో నటిస్తుంది. ఇదిలావుంటే కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్‌లో కీర్తి సురేశ్ పెళ్లి చేసుకోబోతుందని.. అదికూడా ప్రేమ పెళ్లి కాకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లి అని తెలుస్తుంది. పెళ్లి కొడుకు కూడా సురేష్ ఫ్యామిలీకి చాలా దగ్గరి బంధువని.. అందుకే కీర్తి ఒకే చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ రెండోవారంలో గోవాలో కీర్తి సురేశ్ పెళ్లి జరగబోతున్నట్లు టాక్. కాగా దీనిపై కీర్తి సురేష్ క్లారిటీ ఇవ్వవలసి ఉంది.



## అనుచిత వ్యాఖ్యల కేసులో

# నటి కస్తూరికి రిమాండ్

తమిళనాడులోని తెలుగువారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ప్రముఖ సినీ నటి కస్తూరి చెన్నై పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కాగా తాజాగా ఈ కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసులో కోర్టు కస్తూరి ఈ నెల 29 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు పోలీసులు కస్తూరిని చెన్నైలోని ఎగ్మోర్ పుళల్ సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

అంతకుముందు ముందస్తు బెయిల్ కోసం కస్తూరి దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేయడంతో ఆమెను అరెస్టు చేసేందుకు తమిళనాడు పోలీసులు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. అయితే చెన్నైలోని ఆమె ఇంటికి తాళం వేసి ఉండటం, ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో తమిళనాడు పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

కస్తూరిని ఫైనల్‌గా హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి చెన్నై తరలించారు.రీసెంట్‌గా తమిళనాడులోని రాజకీయపార్టీ 'హిందూ మక్కల్ కచ్చి' ఏర్పాటు చేసిన సభలో కస్తూరి ద్రవిడ పార్టీలనుద్దేశించి మాట్లాడుతూ.. ద్రవిడ పార్టీలు బ్రాహ్మణులను పరాయివాళ్లుగా చూడటం సరికాదంటూ.. తెలుగువారి పట్ల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

తమిళనాడులోని రాజుల అంతఃపురంలో పని చేసేందుకు వచ్చిన తెలుగువాళ్లను తమిళనాడు స్థానికులుగా భావిస్తూ, బ్రాహ్మణులను మాత్రం పరాయి వాళ్లుగా చూడటం ఏంటని కస్తూరి ప్రశ్నించింది.

వివాదాస్పదమైన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలపై కస్తూరి వివరణ కూడా ఇస్తూ.. ద్రవిడ పార్టీలు తన వ్యాఖ్యలను వక్రీకరించాయని అన్నారు. తెలుగు ప్రజలను అవమానించడం తన ఉద్దేశం కాదని తెలిపారు.

కేవలం బ్రాహ్మణులను పరాయివాళ్లుగా చూడటం ఏంటని ప్రశ్నించానని, అంతేతప్ప తెలుగువారిని కించపర్చలేదని చెప్పుకొచ్చారు.



# శ్రీరెడ్డిపై మరో కేసు నమోదు

టాలీవుడ్ వివాదాస్పద నటి, యూట్యూబర్ శ్రీరెడ్డిపై ఆంధ్రప్రదేశ్‌లో మరో కేసు నమోదు అయ్యింది. ఇప్పటికే ఈ నటిపై కర్నూలు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రులు లోకేష్, అనితలపై శ్రీరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను గత నెల టీడీపీ నేత రాజు యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కర్నూలు త్రీటౌన్ పోలీసులు పలు సెక్షన్ల కింద శ్రీరెడ్డిపై కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు ఉండగానే.. ఇదే విషయంపై తాజాగా విజయనగరం జిల్లా నెల్లిమర్లలో మరో కేసు నమోదు అయ్యింది. శ్రీరెడ్డి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, అనితలపై, అలాగే నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి లపై అనుచిత వ్యాఖ్యలు చేసిందంటూ నెల్లిమర్ల నగర పంచాయతీ కౌన్సిలర్ కింతాడ కళావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో నెల్లిమర్ల పోలీసులు శ్రీరెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## ప్రభాస్ 'స్పిరిట్' మూవీపై

## అప్‌డేట్ ఇచ్చిన


# సందీప్‌రెడ్డి వంగా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, యానిమల్ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో 'స్పిరిట్' అనే సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. సుమారు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో రానున్న ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ మూవీ షూటింగ్‌కు సంబంధించి క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు సందీప్ వంగా.శనివారం ఒక మూవీ ఈవెంట్‌లో రామ్ గోపాల్ వర్మతో పాల్గొన్న దర్శకుడు సందీప్ ఈ వేడుక అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'స్పిరిట్' సినిమా గురించి పంచుకున్నాడు. ఈ మూవీ షూటింగ్ త్వరలో స్టార్ట్ అవుతుందని అన్ని వివరాలను త్వరలోనే వెల్లడిస్తానని సందీప్ తెలిపాడు. అయితే ఈ చిత్రంలో కొరియన్ నటుడు డాన్ లీ నటించబోతున్నాడు అని వస్తున్న వార్తలపై సందీప్ స్పందిస్తూ.. అన్ని అప్‌డేట్స్ సంక్రాంతికి ఇస్తాను అంటూ చెప్పుకొచ్చాడు. ప్రభాస్ పోలీస్ గెటప్ త్వరలోనే వస్తుంది. అప్పటివరకు వెయిట్ చేయండి అంటూ చెప్పుకొచ్చాడు.



## అఫీషియల్.. రిషబ్ శెట్టి కాంతార చాప్టర్ -1

# రిలీజ్ డేట్ వచ్చేసింది



టాలెంటెడ్ కన్నడ యాక్టర్ కమ్ డైరెక్టర్ రిషబ్ శెట్టి దర్శకత్వంలో 'కాంతార' ఏ రేంజ్‌లో బాక్సాఫీస్‌ను షేక్ చేసిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మరోసారి ట్రెండ్ సృష్టించేందుకు కాంతార ప్రీక్వెల్ కాంతార చాప్టర్ –1 కూడా వస్తుందని తెలిసిందే. ఇప్పటికే లాంఛ్ చేసిన కాంతార చాప్టర్ 1 ఫస్ట్ లుక్, టీజర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి.చాలా రోజుల తర్వాత ఈ మూవీకి సంబంధించి ఇంట్రెస్టింగ్ న్యూస్‌ను షేర్ చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని 2025 అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. తొలిపార్టును రూ.16 కోట్లలోపే నిర్మించిన రిషబ్ శెట్టి.. ప్రీక్వెల్ కోసం రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నాడని ఇన్‌సైడ్ టాక్. ప్రీక్వెల్‌ను కూడా హెంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ నిర్మిస్తుండగా.. కాంతార తర్వాత మరోసారి అజనీష్ లోకనాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని కన్నడతో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.

# పెరుగు, కీరా.. ఫహాడీ రైతా.. అరగంట ఫ్రిజ్‌లో సర్వ్ చేసుకుంటే!

పెరుగు, కీరా కలగలసిన ఫహాడి రైతా తయారీ విధానం తెలుసా?

### ఫహాడి రైతా తయారీకి కావల్సినవి

పెరుగు రెండు కప్పులు,కీరా ఒకటి,ఆవాలు టీస్పూను,పచ్చిమిర్చి రెండు,ఆవ నూనె పావు కప్పు,కొత్తిమీర గుప్పెడు,కారం టీస్పూను,పసుపు అరటీస్పూను,ఉప్పు రుచికి సరిపడా.



### తయారీ...

తొక్క, గింజలు తీసిన కీరాను సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి.పెరుగును పెద్దగిన్నెలో వేసి కవ్వంతో చిలకాలి.
తరువాత పావు కప్పు నీళ్లుపోసి కలపాలి.ఇప్పుడు ఆవాలు, పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పు వేసి కచ్చాపచ్చాగా దంచుకోవాలిదంచిన మిశ్రమం, కీరా తరుగుని చిలికిన పెరుగులో వేయాలి.పసుపు, కారం కూడా వేసి చక్కగా కలుపుకోవాలి.దీనిని అరగంటపాటు రిఫ్రిజిరేటర్‌లో పెట్టి తరువాత సర్వ్ చేసుకోవాలి.

# ఉత్తరాఖండ్ వంటకం

## ఆలుకీ గుట్కే తయారీ ఇలా!

### ఆలుకీ గుట్కే



ఉత్తరాఖండ్ వంటకం ఆలుకీ గుట్కే ఇలా తయారు చేసుకోండి.
**ఆలుకీ గుట్కే తయారీకి కావలసినవి:**బంగాళ దుంపలు మూడు,ఆవనూనె రెండు టీస్పూన్లు,కారం పావు టీస్పూను,ధనియాలపొడి రెండు టీస్పూన్లు,జీలకర్ర పావు టీస్పూను,పసుపు పావు టీస్పూను,ఎండు మిర్చి రెండు,ఇంగువ రెండు చిటికెలు,ఉప్పు రుచికి సరిపడా,కొత్తిమీర తరుగు గార్నిష్‌కు సరిపడా.
**తయారీ...:**కొద్దిగా ఉప్పువేసి బంగాళ దుంపలను ఉడికించాలి.ఉడికిన దుంపల తొక్క తీసి ముక్కలు తరగాలి.చిన్న గిన్నెలో ధనియాల పొడి, కారం, పసుపు, రెండు టీస్పూన్ల నీళ్లుపోసి చక్కగా కలపాలి.స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేయాలి. నూనె కాగాక జీలకర్ర, ఇంగువ, కారం వేసి అరనిమిషం పాటు వేయించాలి.ఇప్పుడు బంగాళ దుంపల ముక్కలు, కలిపి పెట్టుకున్న మసాలా మిశ్రమం, రుచికి సరిపడా ఉప్పు వేసి ఐదు నిమిషాలపాటు వేయించాలి.చివరిగా కొత్తిమీర చల్లుకుని దించేయాలి.

# శుక్లం శాపం,

## దృష్టి లోపం.. కారణాలు, లక్షణాలు, చికిత్స

కంటిశుక్లం అత్యంత విలువైన కంటి చూపును తగ్గించే తీవ్రమైన సమస్య. దీనిపై ప్రజలలో ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. ఇది నిదానంగా పెరిగే సమస్య కావడం వల్ల చాలామంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. తద్వారా సమస్య తీవ్రత పెరిగేందుకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కంటి శుక్లం శస్త్రచికిత్స/క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరం...పై అపోలో స్పెక్ట్రా ఆసుపత్రికి చెందిన వైద్యులు, ప్రముఖ క్యాటరాక్ట్ సర్జన్ డా. అల్పా అతుల్ పూర్బియా అందిస్తున్న సమాచారం ఇది...కంటి శుక్లం..కారణాలు...కంటి లెన్స్ పుట్టుకతో స్పష్టంగా ఉంటుంది, ప్రధానంగా నీరు మరియు ప్రోటీన్లతో కూడి ఉంటుంది. ప్రోటీన్లు కాలక్రమేణా విచ్ఛిన్నం కావడంతో, లెన్స్ తెల్లగా లేదా బూడిద రంగులోకి మారడం ప్రారంభిస్తుంది, ఇది స్పష్టమైన చూపును నిరోధిస్తుంది. దీనికి సాధారణంగా వయస్సు పెరగడం కాగా, అతినీలలోహిత కిరణం/సూర్య కాంతికి గురికావడం వంటివి కూడా కంటిశుక్లంను ప్రేరేపించడానికి కారణాలే. ఇక ఇతర కారణాలలో అతిగా ధూమపానం, దీర్ఘకాలిక మధుమేహం, దీర్ఘకాలిక స్టెరాయిడ్స్ వాడకం వంటివి కూడా ఉండవచ్చు. అలాగే ఆల్కహాల్ దుర్వినియోగం, ఊబకాయం, రేడియేషన్ థెరపీ మొదలైనవి కూడా ఉన్నాయి. ప్రమాదవశాత్తు కంటికి అయిన గాయాలు కూడా కంటిశుక్లం వృద్ధికి కారణం కావచ్చు. కొన్ని సార్లు పుట్టుకతో కూడా కంటిశుక్లం వచ్చే అవకాశం ఉంది. చాలా అరుదుగా పిల్లలలో అభివృద్ధి చెందే కంటిశుక్లంని డెవలప్‌మెంటల్ క్యాటరాక్ట్ అంటారు.గుర్తించాల్సిందే...కంటిశుక్లం నిదానంగా అభివృద్ధి చెందే గుణం కలిగి ఉంటుంది కాబట్టి ముందుగా జాగ్రత్త పడడం కష్టమవుతుంది. దీనిని ముందుగా గుర్తించడానికి రాత్రిపూట దృష్టికి అంతరాయం, తక్కువ కాంతిలో చూడటం కష్టతరం అవడం వంటి లక్షణాలు ఉపకరిస్తాయి. కంటి శుక్లం ఉన్న రోగులు సాధారణంగా లైట్ చుట్టూ ఒక కాంతిని చూస్తారు. అలాగే కంటి శుక్లం ఉన్నప్పుడు ప్రకాశవంతమైన లైట్ల మెరుపు బాధాకరంగా ఉంటుంది, కంటిశుక్లం ఉన్న వ్యక్తులు ప్రకాశవంతమైన సూర్యకాంతిలో సరిగ్గా చూడటం కష్టంగా ఉండవచ్చు లేదా రాత్రి సమయంలో కొన్నిసార్లు మరింత చెదిరిన దృష్టిని గమనించవచ్చు. వారికి ఇండోర్ లైట్లలో కూడా చూపు కష్టంగా ఉండవచ్చు. వీధి లైట్లు



ఎదురుగా వచ్చే వాహనాల నుండి వచ్చే హెడ్‌లైట్ల వల్ల కలిగే కాంతి కారణంగా రాత్రి సమయంలో డ్రైవింగ్ సమస్యగా మారవచ్చు. కంటిశుక్లం బాగు చేసేందుకు మందులతో చేయగలిగిన వైద్య చికిత్స లేదు. మసకబారిన చూపును, దృష్టిని పునరుద్ధరించడానికి శస్త్రచికిత్స ద్వారా కంటిశుక్లం తొలగించడమే మార్గం. . కంటిశుక్లం లక్షణాలు స్వల్పంగా ఉన్నట్లయితే, అద్దాలు లేదా కాంటాక్ట్ లెన్స్ అవసరం కావచ్చు, కానీ కాలక్రమేణా కంటిశుక్లం మరింత తీవ్రమవుతుంది. తర్వాత తర్వాత సాధారణ రోజువారీ కార్యకలాపాలకు కూడా ఇది ఆటంకం కలిగిస్తే శస్త్రచికిత్స చేయక తప్పదు. కంటిశుక్లం తొలగింపు శస్త్రచికిత్స ప్రక్రియను ఇంట్రాకోక్యులర్ లెన్స్ ఇంప్లాంటేషన్స్ తో ఫాకోఎమల్సిఫికేషన్ అంటారు. ఈ ప్రక్రియలో, కంటిశుక్లం వృద్ధి చెందిన అసలు లెన్స్, కృత్రిమ (ఇంట్రాకోక్యులర్ లెన్స్)తో భర్తీ చేయబడుతుంది. ఇది చాలా సురక్షితమైన ప్రక్రియ. ఈ శస్త్రచికిత్స తర్వాత కొన్ని రోజుల పాటు దురద, తేలికపాటి అసౌకర్యం కంటిలో నీరు కారడం వంటివి కనిపించవచ్చు.అయితే నేడు అందుబాటులో ఉన్న తాజా సాంకేతికతతో విజువల్ రికవరీ చాలా వేగంగా ఉంది. శస్త్రచికిత్స తర్వాత కోలుకునే కాలం ఒకరి నుండి మరొకరికి భిన్నంగా ఉండవచ్చు. కొంతమంది కొద్ది రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు, మరికొందరికి కోలుకోవడానికి వారాలు పడుతుంది. ఇతరత్రా సమస్యలు లేనట్లయితే వైద్యులు ఒక వారం విశ్రాంతిని సిఫార్సు చేస్తారు. సాధారణంగా అయితే కొన్ని గంటలలోపే, కంటిలో కాలుష్యం లేదా ధూళి కణాలు ప్రవేశించకుండా నిరోధించడానికి రోగిని రక్షించే గ్లాస్ లేదా కంటికి ఐ ప్యాడ్‌తో ఇంటికి తిరిగి పంపుతారు.

# వంట నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నారా?

## ఎంత డేంజరో తెలుసా..

పెదవాల్తేరు(విశాఖపట్నం): ఇంట్లోను, హొటళ్లలోను ఒకసారి వినియోగించిన వంట నూనెను పదేపదే ఉపయోగించడం పరిపాటి. కానీ అలా చేయడం ఆరోగ్యానికి హానికరం అన్న విషయం చాలా మందికి తెలియదు. దీనిపై ఇప్పుడిప్పుడే అధికారులు కూడా అవగాహన కల్పిస్తున్నారు. వాడిన వంటనూనెతో తయారైన ఆహారం తీసుకోవడం ద్వారా గుండెజబ్బులు, లివర్ జబ్బులు, హైపర్‌టెన్షన్, అల్జీమర్ వంటి వ్యాధులు సోకుతాయని జిల్లా ఆహార భద్రత శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.చదవండి: మీకు తెలుసా?.. విద్యుత్ శాఖ నుంచి మెసేజ్‌లు రావు .కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందిన ఎన్ఎస్ఆర్ ఇండస్ట్రీస్ ఒకసారి వాడిన వంట నూనెను కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే విశాఖలోని పలు హొటళ్లలోను, గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్లలోను వాడిన వంటనూనె సేకరణ కోసం డ్రమ్ములు కూడా ఏర్పాటు చేశారు. లీటర్ అయిల్‌కు రూ.30 వంతున చెల్లిస్తారు. అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, హొటల్ యజమానులు వాడిన వంటనూనె విక్రయాల కోసం సదరు సంస్థను సంప్రదించాలని ఆహార భద్రత శాఖ అధికారులు కోరుతున్నారు. ఈ నూనె సాయంతో బయోడీజిల్ తయారు చేస్తారు. ఫలితంగా పెరుగుతున్న చమురు ధరల నుంచి ఉపశమనం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.



# ఆరిక అన్నం అత్యంత

## బలవర్ధకమైన, ఔషధ గుణాలున్న ఆహారం..

ఆరిక అన్నం ఇంటిల్లిపాదికీ అత్యంత బలవర్ధకమైన, ఔషధ గుణాలున్న ఆహారం. ఖరీఫ్‌లో మాత్రమే సాగయ్యే చిరుధాన్య పంట ఆరిక మాత్రమే. ఆరిక 160–170 రోజుల పంట. విత్తిన తర్వాత దాదాపు 6 నెలలకు పంట చేతికి వస్తుంది. ఆరికలు విత్తుకోవడానికి ఆరుద్ర కార్తె (జూలై 5 వరకు) అత్యంత అనువైన కాలం.మొలిచిన తర్వాత 40–50 రోజులు వర్షం లేకపోయినా ఆరిక పంట నిలుస్తుంది. ఇతర పంటలు అంతగా నిలవ్వు. చిరుధాన్యాల్లో చిన్న గింజ పంటలు (స్మాల్ మిల్లెట్స్).. ఆరిక, కొర్ర, సామ, ఊద, అండుకొర్ర. ఆరిక మినహా మిగతా నాలుగు పంటలూ 90–100 రోజుల్లో పూర్తయ్యేవే.చిరుధాన్యాల సేంద్రియ సాగులో అనుభవజ్ఞుడు, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన రైతు శాస్త్రవేత్త కొమ్మూరి విజయకుమార్ 'సాక్షి సాగుబడి'కి వివరించారు. సేంద్రియ పద్ధతుల్లో ఆరికల సాగులో మెలకువలను ఆయన మాటల్లోనే ఇక్కడ పొందుపరుస్తున్నాం...ఆరిక విత్తనాలు ఒక్క వర్షం పడి తేమ తగలగానే మొలుస్తాయి. ఒక్కసారి మొలిస్తే చాలు. గొర్రెలు తిన్నా మళ్లీ పెరుగుతుంది ఆరికె మొక్క. మొలిచిన తర్వాత దీర్ఘకాలం వర్షం లేకపోయినా తట్టుకొని బతకటం ఆరిక ప్రత్యేకత. మళ్లీ చినుకులు పడగానే తిప్పుకుంటుంది. అందువల్ల సాధారణ వర్షపాతం కురిసే ప్రాంతాలతో పాటు అత్యల్ప వర్షపాతం కురిసే ప్రాంతాలకూ ఇది అత్యంత అనువైన పంట. నల్ల కంకి సమస్యే ఉండదు. ఆరిక పంటకు రసాయనిక ఎరువులు, పురుగుమందులు అవసరం లేదు. పొలాన్ని దుక్కి చేసుకొని మాగిన పశువుల దిబ్బ ఎరువు ఎకరానికి 4–5 ట్రాక్టర్లు(12 టన్నులు) వెదజల్లాలి. లేదా గొర్రెలు, మేకలతో మందగట్టడం మంచిది. గొర్రెలు, మేకలు మూత్రం పోసిన చోట ఆరిక అద్భుతంగా దుబ్బు కడుతుంది. శ్రీవరి సాగులో మాదిరిగా 30–40 పిలకలు వస్తాయి. పొలాన్ని దుక్కి చేసి పెట్టుకొని.. మంచి వర్షం పడిన తర్వాత ఆరికెలను విత్తుకోవాలి. వెదజల్లటం కన్నా గొర్రుతో సాళ్లుగా విత్తుకోవడం మంచిది. గొర్రుతో విత్తితే విత్తనం సమాన లోతులో పడుతుంది. ఒకరోజు అటూ ఇటుగా మొలుస్తాయి. ఒకేసారి పంటంతా కోతకు వస్తుంది. 8 సాళు ఆరికలు విత్తుకొని, 1 సాలు కందులు, మళ్లీ 8 సాళ్లు ఆరికలు, ఒక సాలు ఆముదాలు విత్తుకోవాలి. ఎకరానికి 3 కిలోల ఆరిక విత్తనం కావాలి. కంది విత్తనాలు ఎకరానికి ఒకటిన్నర కిలోలు కావాలి. కిలోన్నర కందుల్లో వంద గ్రాములు సీతమ్మ జొన్నలు, 50 గ్రాములు తెల్ల / చేను గోగులు కలిపి విత్తుకోవాలి. ఎకరానికి 3 కిలోల ఆముదం విత్తనాలు కావాలి. ఎకరానికి పావు కిలో నాటు అలసందలు /బొబ్బర్లు, అర కిలో అనుములు, వంద గ్రా. చేను చిక్కుళ్లు ఆముదాలలో కలిపి చల్లుకోవాలి. ఆరికలు విత్తుకునేటప్పుడు కిలో విత్తనానికి 4 కిలోల గండ్ర ఇసుక కలిపి విత్తుకోవాలి. ఆరికల విత్తనాలు ఎంత సైజులో ఉంటాయో అదే సైజులో ఉండే ఇసుక కలిపి గొర్రుతో విత్తుకోవాలి. కందులు, ఆముదం తదితర విత్తనాలను అక్కిలి / అక్కిడి కట్టెలతో విత్తుకోవాలి. ఆరికలను మిశ్రమ సాగు చేసినప్పుడు పెద్దగా చీడపీడలేమీ రావు. కషాయాలు పిచికారీ చేయాల్సిన అవసరం రాదు.ఐదారు రకాల పంటలు కలిపి సాగు చేయడం వల్ల చీడపీడలు నియంత్రణలో ఉంటాయి. రైతు కుటుంబానికి కావాల్సిన అన్ని రకాల పంటలూ చేతికి వస్తాయి. ఆహార భద్రత కలుగుతుంది. కంది, సీతమ్మ జొన్న తదితర పంట మొక్కల పిలకలు తుంచేకొద్దీ మళ్లీ చిగుర్లు వేస్తూ పెరుగుతాయి. పక్షి స్థావరాలుగా కూడా ఇవి ఉపయోగపడతాయి. ఆరికలు ఎకరానికి ఎంత లేదన్నా 6–8 క్వింటాళ్లు, కందులు 3 క్వింటాళ్లు, ఆముదాలు 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సందేహాలుంటే విజయకుమార్ (98496 48498)ను ఆంధ్రప్రదేశ్ రైతులు ఉ. 6–9 గం. మధ్యలో, తెలంగాణ రైతులు సా. 6–9 గం. మధ్య సంప్రదించవచ్చు.



# పంచదార, తేనె, ఆలివ్ ఆయిల్,

## నిమ్మ.. దెబ్బకు జిడ్డు వదులుతుంది!

### ఓజిగట వదిలించే స్క్రబ్

వర్షాకాలంలో పేరుకుపోయిన మృతకణాలతో ముఖం జిగటగా ఉంటుంది. ఈ జిగటను తొలగించే స్క్రబ్‌ను ఇంట్లోనే అత్యంత సులువుగా తయారు చేసుకోవచ్చు. అదెలాగో చూద్దాం...కప్పు పంచదారలో టీస్పూను తేనె, అరటీస్పూను నిమ్మరసం, టీస్పూను ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి.

ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా అప్లై చేసి ఆరిన తర్వాత సున్నితంగా మర్దన చేసి నీటితో కడిగేయాలి.వారంలో రెండు సార్లు ఈ స్క్రబ్ అప్లై చేయడం వల్ల జిగటపోయి ముఖచర్మం ఆరోగ్యంగా, కాంతిమంతంగా కనిపిస్తుంది.

### సహజమైన క్లెన్సర్స్

ముఖం మరీ మురికిగా అనిపిస్తే పాలు, మీగడ, పెరుగు, మజ్జిగ ఏది అందుబాటులో ఉంటే దానిని పట్టించి మెల్లగా రుద్దాలి. ఇవి సహజమైన క్లెన్సర్స్.మార్కెట్‌లో దొరికే క్లెన్సింగ్ మిల్క్‌కు బదులుగా వీటిని వాడవచ్చు.రోజూ మామూలుగా ముఖాన్ని శుభ్రం చేస్తున్నప్పటికీ దుమ్ముకణాలు చర్మం లోపలి గ్రంథుల్లోకి వెళ్లి చర్మానిక ి పట్టేస్తాయి.అలాంటప్పుడు కూడా ఈ క్లెన్సర్‌ను వాడవచ్చు.



# ఈ అమ్మాయిని చూసి...

## అడవి ముచ్చటపడింది!

పిల్లలు ఇష్టంగా చదువుకుంటుంటే పెద్దలే కాదు ప్రకృతి కూడా ముచ్చటపడుతుంది. నిండు మనసుతో ఆశీర్వదిస్తుంది!'నిద్ర సుఖం ఎరగదు' అంటారు. విద్య కూడా అంతే! ఏసీ గదులలో, మెత్తని సోఫాలలో కూర్చుని చదివితేనే చదువు వస్తుందని ఏమీ లేదు. ఇలా ఎండలో, రాళ్లపై కూర్చొని చదువుకుంటే కూడా చదువు వస్తుంది. అదంతా మన ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. విషయంలోకి వెళితే..హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఒక అమ్మాయి ప్రకృతి ఒడిలో పాఠ్యపుస్తకం చదువుకుంటున్న ఫోటో పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రాను బాగా ఆకట్టుకుంది. 'మన్‌డే మోటివేషన్స్' ట్యాగ్‌లైన్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఇన్‌స్పిరేషనల్ పోస్ట్ నెటిజనులను బాగా ఆకట్టుకుంది.'ఈరోజు నేను హిమాచల్‌ద్రేశ్‌లోని సత్నా ప్రాంతానికి వెళ్లాను. అక్కడ చూసిన ఒక దృశ్యం నన్ను ఆశ్చర్యానందాలకు గురి చేసింది. ఒక అమ్మాయి శ్రద్ధగా చదువుకుటోంది. నోట్స్ రాసుకుంటోంది. పచ్చటి ప్రకృతి ఆమెను దీవిస్తున్నట్లుగా ఉంది. నిజం చెప్పాలంటే... ఈ దృశ్యాన్ని వర్ణించడానికి మాటలు దొరకడం లేదు' అంటూ రాసి మురిసిపోయాడు దూబే.'నిజానికి పిల్లలకు నాలుగు గోడల మధ్య కాకుండా పచ్చటి ప్రకృతి మధ్యే విద్య నేర్పించాలి. ఇలా చేస్తే వారికి ప్రకృతి విలువ తెలుస్తుంది. పర్యావరణ స్పృహ బాల్యం నుంచే కలుగుతుంది. గోడలు లేని బడిలో మనసు విశాలం అవుతుంది. తాత్విక విద్యావేత్తలు ఇదే విషయాన్ని చెప్పారు' అంటుంది ఒక యూజర్.పెద్దల పోరు భరించలేక చదువుకుంటున్నట్లు కాకుండా... చాలా ఇష్టంగా చదువుకుంటున్నట్లుగా ఉంది.



## ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలలో

# యువత ముందుండాలి

**- సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు కే.ఎన్. శ్రీనివాస్ అన్నారు.**

ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో శారీరక, మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికత ఇప్పుడున్న బిజీ పరిస్థితుల్లో అత్యవసరమని అన్నారు. ధర్పల్లి మండలంలోని రేకులపల్లి భజన మండల స్థాయి నుంచి సేవా సమితిగా అప్ గ్రేడ్ చేసే శుభ సందర్భంగా గ్రామంలో ప్రత్యేకంగా జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సూచించిన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస మార్గాలలో నడవాలని ఆయన సూచించారు. సత్యసాయి సంస్థలో కేవలం ఆధ్యాత్మిక చింతనే కాకుండా సేవా కార్యక్రమాలతో ఇమిడి ఉంటుందని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని అన్నారు. ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు సేవలు అందించడం గ్రామస్థాయిలో నిర్వహించే సేవలను విస్తృతం చేసేందుకు గ్రామాలలో భజన మండలాలు, సేవాసమితిలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. సేవలను విస్తృతం చేయడానికి సత్యసాయి సంస్థలు వృద్ధి చెందేల ప్రయత్నాలు చేస్తున్నామని డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో ఈ సందర్భంగా మోతిబిందు నిర్ధారణ శిబిరం ఏర్పాటు చేసి



పలువురికి కంటిపరీక్షలు చేసినట్లు తెలిపారు. వారికి ఉచితంగా మందులు అందించినట్లు వివరించారు. గ్రామంలో సత్యసాయి రథం వీధులలో తిప్పుతూ స్వామి వారి కీర్తనలు ప్రజలకు వినిపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల జిల్లా, మండల స్థాయిలో వివిధ శాఖల బాధ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



## కార్తీకమాసం సందర్భంగా శైవ క్షేత్రాలకు

# పోలీస్ శాఖ పగడ్బందీగా ఏర్పాట్లు

- భక్తుల ప్రశంసలు

శ్రీశైలం (ప్రశ్న న్యూస్) ఈ సంవత్సరం అనగా 2024 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు మరియు కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వార్ల ఆదేశాలు మేరకు నంద్యాల జిల్లా ఎస్పి శ్రీ అధిరాజ్ సింగ్ రానా స్వీయ పర్యవేక్షణ లో శ్రీశైలం మహా పుణ్యక్షేత్రం నందు కార్తీక పౌర్ణమి దృష్ట్యా ఏర్పాటు చేయబడిన జ్వాలాతోరణం, కృష్ణ నది జల హారతి, పుష్కరిణి వద్ద దశహారతులు మరియు లక్ష దీపార్చన కు శ్రీశైలం కు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నంద్యాల జిల్లా పోలీస్ హెూంగార్డు నుండి డిఎస్పి స్టాయి వరకు నంద్యాల జిల్లా ఎస్పి అధిరాజ్ సింగ్ రానా అద్వర్యం లో ఒక టీం లా పనిచేసి విజయవంతం చేయడం జరిగింది. భక్తులకు మరియు వాహనదారులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా 10 బ్లూ కోర్ట్ వాహనాలు, 4 రక్షక్ పెట్రోలింగ్ వాహనాలు, 02 టోయింగ్ వాహనాలతో, %జజ% కెమెరాస్ కమాండ్కంట్రోల్ మరియు డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతూ ట్రాఫిక్ క్లియర్ చేయడం జరిగింది.

(1) హైదరాబాద్ మరియు విజయవాడ రోడ్స్ నందు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా

(2) భక్తుల వాహనాలకు పార్కింగ్ స్థలాలకు కు ఇబ్బంది లేకుండా



(3) దేవాలయం క్యూ లైన్స్ మరియు లడ్డు కౌంటర్స్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినారు.

(4) ఆర్టీసీ బస్టాండ్, నంది సర్కిల్, హటకేశ్వరం, సాక్షి గణపతి,



లింగాల గట్టు, దాసరి అన్నదాన సత్రం, పాతాళ గంగా, నంది మండపం సర్కిల్, జేసీ కాటేజ్ దగ్గర పోలీస్ ఇలాండ్స్ మరియు బరికేడ్స్ ఏర్పాటు చేయడమైనది.

# డిజిటల్ మీడియా ప్రజల పక్షాన నిలబడాలి

**ప్రజల్లో ఉమ్మడి రాజకీయ చైతన్యాన్ని పెంచాలి**

**డీఎంజేయూ ఆవిర్భావ సభలో ప్రముఖ జర్నలిస్ట్ పాశం యాదగిరి**

**మహబూబాబాద్ లో ఆవిర్భావ సభ,జెండా ఆవిష్కరణ**

మహబూబాబాద్(ప్రశ్న న్యూస్) డిజిటల్ మీడియా ప్రజల పక్షాన నిలబడి పేద ప్రజల బతుకు జీవితాలను వెలికి తీయాలని ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి,సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కరుణాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుప్రభ కాన్ఫరెన్స్ హాల్లో డిజిటల్ మీడియా జర్నలిస్టు యూనియన్(డి ఎం జే యూ) జెండా ఆవిష్కరణ ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి చేయగా అనంతరం ఆవిర్భావ సభ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు అశోక్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన యాదగిరి,కరుణాకర్ రెడ్డి లు మాట్లాడుతూ మీడియా అంటే గుత్తాధిపత్యం లో నడుస్తున్న వ్యవస్థ అని దానికి భిన్నంగా సోషల్ మీడియా కామన్ మ్యాన్ సామాన్యుల జీవితాలను చూపించాలన్నారు. సమాజాన్ని చైతన్యం చేయడంలో డిజిటల్ మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు. జర్నలిజంకి కేంద్ర బిందువు విమర్శాత్మకమైనటువంటి ఆలోచనే. పేదోడి గొంతుకగా డిజిటల్ మీడియా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానుకోట సీనియర్ జర్నలిస్టు కల్లూరి ప్రభాకర్,యూనియన్ వ్యవస్థాపకులు ఎంపెల్లి ముత్తేష్, జాతీయ గౌరవాధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి,రాష్ట్ర అధ్యక్షులు కే రాజేంద్రప్రసాద్,జాతీయ నేత చందా శ్రీనివాస్(సిఎస్ రావు), ఆంధ్రప్రదేశ్ నాయకులు సుధాకర్,




రాష్ట్ర ఉపాధ్యక్షులు కడమంచి చెన్నయ్య,కేతోజు వెంకటాచారి, మంద వేణుగోపాల్,రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్ణ కుమార్,గుడాల సునీల్ చంద్ర, రాష్ట్ర నాయకులు యార సాంబయ్య,స్థానిక నాయకులు లక్ష్మయ్య, అమీర్,యాకాంతం,కిషన్ రావు, శ్రీనివాస్,నరేందర్ తోపాటు ఆయా జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ల నిర్మాణం కోసం స్థల పరిశీలన

మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) ఆనందబాగ్ ఆర్.యూ.బి వద్ద, సర్దార్ పటేల్ నగర్ లో రైల్వే స్టేషన్ ల నిర్మాణం కోసం రైల్వే అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్ బాగ్ లో స్టేషన్ నిర్మాణం అనుకూలంగా లేకపోతె కొద్దీ పక్కాగా ఉన్న స్థలాన్ని పరిశీలించాలని అధికారులను కోరడం జరిగింది. అదే విధంగా సర్దార్ పటేల్ నగర్ లో హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ లకు అనుకూలంగా చాలా రైల్వే స్థలం అక్కడికి రాకపోకలకు అనువైన రోడ్లు, పార్కింగ్ స్థలం అన్ని ఉన్నాయని అక్కడ కూడా మరో స్టేషన్ ఏర్పాటు కొరకు ప్రతిపధాన చెయ్యాలని కోరడం జరిగింది. తప్పకుండ త్వరలో నివేదికలు ఏర్పాటు చేసి ఉన్నతధికారులకు పంపిస్తామని రైల్వే అధికారులు తెలియచేయడం జరిగిందని కార్పొరేటర్ తెలిపారు.



## శ్రీశైల క్షేత్రంలో శాశ్వత అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం

**- దాతకు బాండు అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు టీ. హిమబిందు**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణకు వెంకటేష్ సాక్షి, విజయవాడ వాస్తవ్యులు 1,00,000/-విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు టి హిమబిందుకు అందజేశారు. దాతకు స్వామి అమ్మవార్ల దర్శనం దేవస్థానం తరపున స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు లడ్డూ ప్రసాదం అందజేశారు.

## సాంస్కృతిక సారథి చైర్పర్సన్ వెన్నెలకు హార్దిక శుభాకాంక్షలు

**జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్య రాజ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ గా తూప్రాన్ ముద్దు బిడ్డ గద్దర్ అన్న కూతురు వెన్నెల ను నియమించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా బుడ్డ భాగ్య రాజ్ మాట్లాడుతూ ఉద్యమ గొంతుకలకు ఊతంగా నిలిచే 'తెలంగాణ సాంస్కృతిక సారథి'కి చైర్‌పర్సన్‌గా డాక్టర్ గుమ్మడి వెన్నెల గద్దర్ కూతురు ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినియమించిన సందర్భంగాముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకి, రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ కి. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సిరెడ్డి కి స్థానిక మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ కి మరియు కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్ తూప్రాన్ ప్రాంతం కావడంతో తూప్రాన్ మండల్ కు ఎంతో గర్వకారణమని, ఒక గుర్తింపు అని తూప్రాన్ మండల ప్రజలంతా ఆనందడోలికల్లో మునిగి తేలుతున్నారని అన్నారు. వెన్నెలకు చైర్మన్ పదవి రావడం చాలా సంతోషంగా ఉందని ఒక ప్రకటనలో కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

## గ్రూప్ 3 పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) టిజిపిఎస్సి నిబంధనలు ప్రకారం పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్ అనుమతి లేనికారణంగా నిబంధనలు పాటిస్తూ, పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకురావద్దన్న ఆదేశాలను ఆయన అనుసరించారు. తన సెల్ ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, పర్యవేక్షణ, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెట్లుకు సూచించారు. జిల్లాలో గ్రూప్ 3 పరీక్ష నిర్వహణకు 19 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షా సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష. పూర్తి అయ్యే వరకు అభ్యర్థులను బయటికి పంపొద్దని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరాటంకంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు అన్ని కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సురక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 3 సబ్జెక్ట్ ల్లో పరీక్ష ఉంటుందని మొదటి రోజు ఉదయం, సాయంత్రం అలాగే 18వ తేదీన ఉదయం ఒకపరీక్ష ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. 5,867 అభ్యర్థులకు గానుగ్రూప్ - 03 పరీక్షలకు ఈరోజు ఉదయం 3,187 హాజరు కాగా 2,680 మంది అనివార్య కారణాలవల్ల పరీక్షకు హాజరు కాలేదని, 54.32%నమోదయిందని తెలిపారు. 5,867 అభ్యర్థులకు గానుగ్రూప్ - 03 పరీక్షలకు ఈరోజు మధ్యాహ్నం 3,184 హాజరు కాగా 2,683 మంది అనివార్య కారణాలవల్ల పరీక్షకు హాజరు కాలేదని, 54.27%నమోదయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం దేవస్థానం లో నూతన ఈఓగా ఎస్.చంద్రశేఖర్ ఆజాద్



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) మంగళగిరిలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీశైల దేవస్థానం నూతన కార్యనిర్వహణ అధికారి ఎస్. చంద్రశేఖర్ ఆజాద్.

# ఆమ్మో మా ఊరికి దయ్యం పట్టింది

## - జంగాలపల్లిలో దెయ్యం భయం

- మనుషులను వేటాడుతున్న దెయ్యం
- ఇప్పటివరకు 20 మంది మృతి
- వణికిపోతున్న జంగాలపల్లి గ్రామం
- చేతబడులా.? అనారోగ్య సమస్యలా.?
- డి హెచ్ ఎం ఓ,
  జిల్లా కలెక్టర్ స్పందించారా.?






**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆ గ్రామంలో జనాలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఏం జరిగిందో తెలిసేలోపే ప్రాణాలు వదులుతున్నారు. ఉన్నట్టుండి అనారోగ్యానికి గురవుతున్నారు ఆస్పత్రికి ప్రాణాలతోనే వెళ్తున్నారు కానీ వచ్చేటప్పుడు మాత్రం శవాలుగానే వస్తున్నారు. ఒక ఇంట్లో దీపం ఆరిపోయిందన్న బాధ చల్లారకముందే మరో ఇంట్లో చావు డప్పులు మోగుతూనే ఉన్నాయి. అందులోనూ ఆడమగ అనే తేడా లేకుండా 30 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్నవాళ్లే ఎక్కువగా ప్రాణాలు వదులుతున్నారు. నెల రోజులుగా ఇదే జరుగుతోంది. ఇప్పటికే 26 మంది వరకు చనిపోయారు. దీంతో అసలు ఆ గ్రామంలో ఏం జరుగుతుందో ఎవ్వరికీ అంతుపట్టట్లేదు. కళ్ల ముందే తమ తోటి గ్రామస్థులు పిట్టల్లా రాలిపోతుంటే మిగతా జనాలు ఓవైపు ఏడుస్తూనే మరోవైపు ఎప్పుడెప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ భయంతో బతుకుతున్నారు. అప్పట్లో సూపర్ స్టార్ మహేష్ బాబుతో త్రివిక్రమ్ శ్రీనివాస్ తీసిన ఖలేజా సినిమాలో ఓ చిన్న గ్రామంలో జనాలు ఉన్నట్టుండి పిట్టల్లా రాలిపోతుంటారు. ఎందుకు చనిపోతున్నారో తెలియక ప్రాణాలు కోల్పోతున్న వారిని కాపాడుకోలేక చనిపోతున్న వారి సంఖ్యను లెక్కపెట్టుకుంటూ ఆ గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతుంటారు. అచ్చంగా అలాంటి భయానక సన్నివేశాలే ఆ గ్రామంలోనూ నెలకొన్నాయి. ఇలాంటి భయానక పరిస్థితులు ఎక్కడో కాదు ములుగు జిల్లా జంగాలపల్లిలో నెలకొన్నాయి. నెల రోజులుగా గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, వరుస మరణాలతో చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామస్థులంతా భయంతో గజ గజా వణికిపోతున్నారు. రాత్రయితే చాలు బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. ఇంటి ముందు లైట్లు ఆర్పేసి ఇంటికి తాళాలు వేసుకొని ఇంట్లోనే బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఎవరి ఇంట్లో నుంచి ఎలాంటి వార్త వస్తుందోనని భయంతో వణికిపోతున్నారు. గ్రామంలో గత నెల నుంచి వరుస మరణాలు సంభవిస్తున్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. ఇప్పటి వరకు జంగాలపల్లిలో ఆడవాళ్లు, మగవాళ్లు కలిపి 26 మంది చనిపోయినట్టు చెప్తుండగా అందులో చాలా వరకు యుక్త వయసు వాళ్లే ఎక్కువగా ఉంటుండటం చనిపోయన వారందరికీ ఒకే రకమైన అనారోగ్య లక్షణాలు కనిపించటం, అస్వస్థతకు గురైన రెండు మూడు రోజుల్లోనే ప్రాణాలు వదులుతుండటం గ్రామస్థులను మరింత కలవరపెడుతోంది. ఈ విషయం గురించి గ్రామస్థులు మాట్లాడుతూ తమ ఊరిలో గత నెల నుంచి వరుసగా మరణాలు సంభవిస్తున్నాయని చెప్తున్నారు. ఆస్పత్రికి తీసుకుపోతే మాములుగా మారి తిరిగి వస్తారన్న నమ్మకం లేకుండాపోయిందని నిస్పృహతో చెప్తున్నారు. వెళ్లేటప్పుడు ప్రాణాలతోనే వెళ్తున్నారని కానీ వచ్చేటపుడు మాత్రం శవాలుగా వస్తున్నారని విలపిస్తున్నారు. మరోవైపు గ్రామంలో జరుగుతున్న పరిణమాలతో ఊరికి ఏదో అరిష్టం పట్టిందని కొందరు పెద్దవాళ్లు అభిప్రాయపడుతుంటే చనిపోయిన వాళ్లందరికీ ఎవరో చేతబడి చేసుంటారని మరికొందరు వాపోతున్నారు. గ్రామానికి పీడ పట్టిందని గ్రామ దేవతలకు శాంతి పూజలు చేయాలని మరికొందరు పెద్దలు సూచిస్తున్నారు. ఊళ్లో ఏదో తిరుగుతుందని గ్రామ దేవతను శాంతి పర్చాలని మరికొందరు భూతవైద్యులు చెప్తున్నారని తెలిపారు. అయితే గ్రామస్థులు మాత్రం గ్రామ దేవతలకు తాము నిత్యం పూజలు చేస్తూనే ఉన్నామని మొక్కుబడులు క్రమంగా చెల్లిస్తూనే ఉన్నామని చెప్తున్నారు. అయితే కాగా ప్రస్తుతం ఈ గ్రామానికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. గ్రామస్థులు ఇలా చనిపోవడానికి అంత చిక్కని జబ్బులే కారణమని గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులకు యువకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాన్ని సందర్శించి ప్రజల్లో నెలకొన్న అనుమానాలు అపోహలు పూర్తిగా తొలగించి మనోధైర్యం కలిగేలా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని యువత కోరుతున్నారు. అసలు వరుస మరణాలకు కారణాలేంటో తెలుసుకుని సరైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

# భారీగా పట్టుబడ్డ నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్

## - ప్రముఖ హొటళ్లకు ఈ దరిద్రమే సరఫరా.?

- నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ముఠా ని అరెస్టు చేసిన నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు
- నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారుచేస్తున్న 8 మంది అరెస్టు
- 1500 కిలోల నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ని సీజ్

**బోయిన్ పల్లి (ప్రశ్న న్యూస్)** అమ్మబాబోయ్, ఇదేందిరా ఇది ఇంత ఘోరంగా ఉన్నారేంట్రా. ఇది కచ్చితంగా హైదరాబాద్ వాసులు ఉలిక్కిపడాల్సిన ఘటన. జంట నగరాల్లో ప్రముఖ హొటళ్లు, రెస్టారెంట్లలోకి వెళ్లి లొట్టలేసుకుంటూ తినే ప్రతిఒక్కరూ ఒక్కక్షణం గుండెను రాయి చేసుకోవాల్సిందే. ఇటీవల పదే పదే అల్లం వెల్లుల్లి పేస్ట్ కల్తీ గురించిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసి కల్తీలు జరుగుతున్నాయని ఆ కల్తీ సరుకు హొటళ్లు, రెస్టారెంట్లకు వెళ్తోందని హెచ్చరిస్తే మనమేమి అలాంటి కల్తీ సరుకు వాడే హొటళ్లలోకి వెళ్లట్లేదు అలాంటి దరిద్రాన్ని వాడే రెస్టారెంట్లలోని ఫుడ్ తినట్లేదని సర్ధిచెప్పుకున్నారు. అయితే అధికారుల దాడుల్లో ఇన్ని రోజులు 10 కిలోల నుంచి మొదలు 100 కిలోల వరకు కల్తీ అల్లం వెల్లుల్లిని సీజ్ చేసిన దాఖలాలు ఉన్నాయి. ఒకటో రెండో సందర్భాల్లో 300 కిలోలు కూడా సీజ్ చేశారు. కానీ ఈసారి మాత్రం అంతకు మించి ఏకంగా 1500 కిలోల అల్లం వెల్లుల్లి పేస్టును అధికారులు సీజ్ చేయటం ఇప్పుడు సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. అయితే ఈ టన్నుల కొద్దీ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును ప్రముఖ హొటళ్లు, ఫేమస్ రెస్టారెంట్లకే సరఫరా వేస్తున్నారన్న విషయం గొంతులో ఘాటెక్కిస్తోంది.

తాజాగా సికింద్రాబాద్ పరిధిలోని బోయిన్‌పల్లిలో భారీ ఎత్తున కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ పట్టుబడింది. బోయిన్‌పల్లిలోని రాజరాజేశ్వరి నగర్‌లో ఖార్కానాలో "సోనీ అల్లం వెల్లుల్లి పేస్ట్" పేరుతో ఈ కల్తీ భాగోతాన్ని నడిపిస్తున్నారు. ఆదివారం (నవంబర్ 17న) రోజున కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బోయిన్‌పల్లి పోలీసులు సంయుక్తంగా తయారీ యూనిట్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500 కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ పట్టుబడగా మరో నాలుగున్నర లక్షలు విలువ చేసే మెటీరియల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో పోలీసులు మొత్తం 8 మందిని అరెస్ట్ చేశారు. సోనీ అల్లం వెల్లుల్లి పేస్ట్ యజమాని మహ్మద్ షకీల్ అహ్మద్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అయితే ఈ అల్లం వెల్లుల్లి పేస్ట్ కల్తీ భాగోతం బయటపడటం ఒక ఎత్తయితే ఈ దరిద్రాన్ని ఇన్నిరోజులు ఎక్కడెక్కడికి సరఫరా చేశారనే తెలిస్తే, ద్యావుడా అని ఆ పైవాన్ని ఓసారి తలుచుకోవాల్సిందే. జంట నగరాల్లో ఉన్న ప్రముఖ



హొటళ్లు, ఫేమస్ రెస్టారెంట్లే వీళ్ల కస్టమర్లంటా. పెద్ద పెద్ద హొటళ్లు, రెస్టారెంట్లే టార్గెట్‌గా ఈ దందా నిర్వహిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇప్పుడు పట్టుబడిందే 1500 కిలోలంటే ఇన్ని రోజులు టన్నులకు టన్నుల ఈ దరిద్రాన్నే పేరు మోసిన హొటళ్లు, రెస్టారెంట్లకు సరఫరా చేసి ఉంటారుగా. మరి మీరు కూడా అప్పుడో ఇప్పుడో ఎప్పుడో ఒక్కసారైనా పెద్ద పెద్ద ఫేమస్ ప్రముఖ హొటళ్లు రెస్టారెంట్లకు వెళ్లే ఉంటారుగా అందులో రుచికరమైన భోజనాన్ని లోట్టలేసుకుంటూ కడుపునిండా ఆరగించే ఉంటారుగా. ఆ హొటల్‌కు కూడా ఇదే సరుకును పంపించారేమో ఎవరికి తెలుసు.?

# మొత్తం మీద ఫుట్ పాత్ ఆక్రమణ తొలగించారు

- సంవత్సరాల తర్వాత స్పందించిన జిహెచ్ఎంసి అధికారులు
- ఏసిపి ముంతాజ్ బేగం అవినీతికి ఇప్పుడు ప్రక్షాళన
- సమస్యలు, అవినీతి అక్రమాలపై జిహెచ్ఎంసి ఉన్నత అధికారుల పూర్తి నిర్లక్ష్యం



తార్నాక(ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలో రోడ్ల, ఫుట్ పాత్ ల ఆక్రమణ యదేచ్ఛగా జరుగుతున్న అధికారులు స్పందించకపోవడం వల్ల ప్రజల అవస్థలు తీవ్రమవుతున్నాయి. అందులో భాగంగా తార్నాక చౌరస్తాలోని హెచ్ పి పెట్రోల్ పంపు యజమాని ఫుట్ పాత్ కబ్జా చేసి యదేచ్ఛగా ఉపయోగించుకుంటున్న ఇప్పటి వరకు దానిని ఎన్నో ఫిర్యాదులు, పత్రికలో కథనాలు వచ్చిన సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్లు ఇప్పటివరకు స్పందించిన దాఖలాలు లేవు. ఈ తథాంగమంతా ఏసీపీగా విధులు నిర్వహించిన ముంతాజ్ బేగం కనుసైగల్లో జరిగింది ఆమె విధులు నిర్వహించే సమయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో అనేక అవినీతి అక్రమాలు జరిగినా కూడా ఉన్నత అధికారులు ఆమెపై చర్యలు తీసుకోకపోవడం వాళ్ల బాధ్యత రాహిత్యానికి నిదర్శనంగా నిలిచింది. మొత్తం మీద ఎట్టకేలకు శనివారం సికింద్రాబాద్ సర్కిల్ అధికారులు పెట్రోల్ బంక్ ఆక్రమించిన ఫుట్ పాత్ తొలగించారు. దీనిపై ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కానీ అధికారులు రోడ్డు ఫుట్ పాత్ కబ్జా చేసి సంవత్సరాల తర్వాత స్పందించడం విడ్డూరంగా ఉందని ఇదే తరహాలో వాళ్లకు జీతాలు కూడా ఇలా సంవత్సరాల తర్వాత ఇస్తే తీసుకుంటారా.? అని ప్రశ్నించారు. జీతాలు మాత్రం ప్రతినెల సమయానికి కావాలి కానీ ప్రజల సమస్యలపై ఫిర్యాదులపై మాత్రం వెంటనే స్పందించరని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.



## రహదారిపై పొంగుతున్న డ్రైనేజీ

# పట్టించుకోని మేనేజర్

- జలమండలి మేనేజర్ల నిర్లక్ష్యంతో ప్రజల అవస్థలు
- బాధ్యతారహిత్యం, అవినీతి అక్రమాలు
  సిబ్బంది అధికారుల డ్యూటీ గా మారిందా.?



**తార్నాక (ప్రశ్న న్యూస్)** జలమండలి అధికారుల నిర్లక్ష్యం రోజురోజుకు తీవ్రమౌతుంది. రహదారులపై డ్రైనేజీ పొంగిపొర్లుతున్న జలమండలి మేనేజర్లు పూర్తి బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. శాంతినగర్, తార్నాక జలమండలి పరిధిలో మేనేజర్లు పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేస్తున్నారని రోడ్లపై డ్రైనేజీలు పొంగుతున్న వాటిని మరమ్మత్తులు చేయకపోవడంతో పాదాచారులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. లక్షలలో జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవ చేయడం లేదని స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం తోడు కావడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్ హెూల్స్ మరమ్మత్తులు నాసిరకంగా చేసి అందిన కాడికి దండుకుంటున్నారని కాంట్రాక్టర్లతో చేతులు కలపడంతో ఒకే జలమండలి పరిధిలో కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టర్లు పాతుకుపోయి వచ్చిన మేనేజర్లు కాంట్రాక్టర్లు ఏకమై నాసిరకం పనులు చేస్తూ అందిన గాడికి దండుకోవడమే తమ డ్యూటీగా పెట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్లపై డ్రైనేజీ పొంగుతున్న మేనేజర్లు స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే లాలాపేట రహదారిపై పొంగుతున్న డ్రైనేజీని మరమ్మత్తు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# కిషన్ రెడ్డి మూసీ నిద్ర ఫొటోషూట్ కోసమే

## - తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో అధికార కాంగ్రెస్ విపక్ష బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మూసీ వార్ జరుగుతున్న సంగతి తెలిసిందే. మూసీ సుందరీకరణ, మూసీ ప్రక్షాళన పేరిట రేవంత్ సర్కారు భారీ ప్రాజెక్టు చేపట్టగా తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు చేస్తున్న బీజేపీ నేతలు మూసీ నిద్ర పేరిట కార్యాచరణకు తెరలేపారు. కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి కూడా మూసీ పరీవాహక ప్రాంతంలోని ఓ బస్తీలో మూసీ నిద్ర చేపట్టారు. దీనిపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మూసీ ప్రాజెక్టును ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కిషన్ రెడ్డి మూసీ నిద్ర ఫొటోషూట్ కోసమేనని విమర్శించారు. ఒక్క రోజు నిద్ర చేసి ఏం సాధించారని ప్రశ్నించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో మూడు నెలలు ఉంటే అక్కడి ప్రజల అవస్థలు తెలుస్తాయని అన్నారు. మూసీ నది పక్కన 3 నెలలు బస చేయాలని సవాల్ చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తాను కూడా 3 నెలలు మూసీ పక్కనే బస చేస్తానని తెలిపారు. మూసీ ప్రజలు అనారోగ్యాల పాలవుతుండడం విపక్ష నేతలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో గ్రాఫ్ పడిపోయినప్పుడు మాత్రమే కిషన్ రెడ్డి బయటికి వస్తారని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ను కాపాడేందుకు కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

## నా పిల్లలు ఇద్దరితో

# నేను మరాఠీలో మాట్లాడుతాను

## - బల్లార్పూర్ లో పవన్ కల్యాణ్



**ముంబై (ప్రశ్న న్యూస్)** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల తరపున ఆదివారం రెండో రోజు ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ మధ్యాహ్నం ఆయన బల్లార్పూర్ లో ఎన్డీయే అభ్యర్థి సుధీర్ ముంగటివార్ కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ ప్రసంగిస్తూ తనకు మరాఠీ భాష అంటే గౌరవం అని వెల్లడించారు. భాష పట్ల గౌరవంతో మరాఠీ నేర్చుకున్నానని, తన ఇద్దరు పిల్లలతో మరాఠీలో మాట్లాడతానని తెలిపారు. విదేశీ భాషలు నేర్చుకోవడంపై ఆసక్తి చూపించే మనం మన సరిహద్దు రాష్ట్రాల భాషలు కూడా నేర్చుకోవాలి కదా అని సున్నితంగా చురక అంటించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఐదు ప్రాంతీయ భాషలు నేర్చుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఇక, రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ తాను ఏపీలో మార్పు తీసుకొచ్చి చూపించానని, వైసీపీని ఓడించలేరు అంటే ఓడించి చూపించానని వ్యాఖ్యానించారు.? ఇప్పుడు మరాఠా ప్రజలకు కూడా ఎన్డీయే ప్రభుత్వాన్ని గెలిపించి, అభివృద్ధి కొనసాగేందుకు దోహదపడాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర అభివృద్ధి చెందాలన్నా, బల్లార్పూర్ అభివృద్ధి చెందాలన్నా, రూ.లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా మహారాష్ట్ర అవతరించాలన్నా ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588